thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 184 | జగిత్యాల మంగళవారం 13 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఆరు బంతుల్లోనే అదరగొట్టేశాడు




11

# కరువు వదిలేసి.. ఢిల్లీకెళ్తారా?

## రైతుల కష్టాలు గాలికి.. సీఎం ఢిల్లీ టూర్

- పొన్నం ఆరోపణలను రుజువు చేయాలి
- పది మంది బాధితులనైనా తీసుకురావాలి
- నిరూపించకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీజేపీని రావణుడితో పోల్చడం విడ్డూరం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు



3

# వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్ర!



- ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థలపై కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు
- 'ఇండి' కూటమిపై తీవ్రస్థాయిలో మండిపడ్డ బీజేపీ ఎంపీ లక్ష్మణ్



# దద్దరిల్లిన ఢిల్లీ!

## ఓటర్ల జాబితాలో గోల్‌మాల్‌పై ప్రతిపక్షాల కదం

- ఓటర్ల జాబితాలో గోల్‌మాల్‌పై ప్రతిపక్షాల కదం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన విపక్ష కూటమి బృందం

ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కేంద్ర ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో భారీ ఆందోళన చేపట్టాయి. 'చలో ఢిల్లీ ఉ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మార్చ్' పేరిట కన్నాట్ ప్లేస్ నుంచి మండి హౌస్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఆందోళనకారులు సుప్రీంకోర్టు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఢిల్లీ వీధుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

వివరాలు 4లో..

# బీజేపీ కోసమే ఎస్ఐఆర్ కుట్ర



- ఎన్నికల సంఘం ద్వారా అక్రమాలు
- దేశ పౌరుల ఓటు హక్కు రక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- ఢిల్లీ నిరసనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బీజేపీ మాత్రమే గెలిచేందుకు అవకాశం ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర ఆరోపణలు చేశారు.

వివరాలు 2లో..




# మరో స్వాతంత్ర్య పోరు!

నాడు సైమన్ గో బ్యాక్.. నేడు 'జ్ఞానేశ్ గో బ్యాక్'

- ఇప్పటికే 13 కోట్ల ఓట్ల తొలగింపు.. 20 కోట్లకు పెంచే యత్నం
- ప్రభుత్వాలను ప్రశ్నించేవారి ఓట్లు గల్లంతు చేస్తున్నారు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు.

2



# రూ.20 లక్షల లంచం తీసుకుంటూ సర్వేయర్ అరెస్ట్

- తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాలతోనే లంచం.. ఇద్దరి అరెస్ట్
- నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు నిందితులు

2



ఫారం-6 మార్పులకు మేం

# ఆమోదం ఇవ్వలేదు!

4

ఎన్నికల సంఘం వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు కీలక స్పష్టీకరణ



# సుప్రీంకోర్టును రాజకీయాల్లోకి లాగొద్దు

- ప్రతిపక్ష నేతలకు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టీకరణ

4

# వరికి క్రాప్ హాలిడే!

- ఎల్-నినోతో తీవ్ర జల, విద్యుత్ సంక్షోభం
- ఆరుతడి పంటల సాగుకే మొగ్గు చూపాలి
- రైతులకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు

2



# తెలంగాణకు జపాన్ ప్రతినిధులు

- ఘన స్వాగతం పలికిన స్పీకర్, చైర్మన్
- స్నేహ సంబంధాలపై కీలక చర్చలు

2





# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువే!

- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యుత్, నీటి కొరత
- మాజీ మంత్రి హరీశ్ రావు

3



# ఖాకీ ధారణ.. గొప్ప అదృష్టం!

- డీఎస్పీల పరేడ్‌లో డీజీపీ సీవీ ఆనంద్

2



# వరికి క్రాప్ హాలిడే!

**ఎల్-నినోతో తీవ్ర జల, విద్యుత్ సంక్షోభం**

**ప్రాజెక్టుల నీరు తాగునీటికే పరిమితం**

**ఆరుతడి పంటల సాగుకే మొగ్గు చూపాలి**

**రైతులకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు**

**2027 వరకు ఎల్-నినో కొనసాగే ప్రమాదం**

**హైదరాబాద్, అక్టోబర్ 12 :** ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో తీవ్ర జల, ఇంధన సంక్షోభం పొంచి ఉందని, అందువల్ల ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటికి, పశువుల అవసరాలకే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ యాసంగి (రబీ) సీజన్‌లో రైతులు వరి, పత్తి పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని విజ్ఞప్తి చేసింది. 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎల్-నినో పరిస్థితులపై సమగ్ర సమీక్ష జరిపారు. వాతావరణ సంస్థల అంచనాల ప్రకారం ఎల్-నినో ప్రభావం డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, 2027 వరకు ఈ దుర్భిక్ష పరిస్థితులు కొనసాగే ప్రమాదం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరించారు. రానున్న జూన్, జులై వరకు సరైన వర్షాలు కురిసే అవకాశం లేనందున అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, మూగజీవాలకు పశుగ్రాసం కొరత రాకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ఆరుతడి పంటలకే సబ్సిడీ: మంత్రి తుమ్మల**

రానున్న వేసవిలో ఉష్ణోగ్రతలు ఏకంగా 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలోని 315 మండలాల్లో ఇప్పటికే అత్యల్ప వర్షపాతం నమోదైందని, అందువల్ల రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి, పత్తి సాగుకు పూర్తిగా దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తక్కువ సమయంలో చేతికొచ్చే ఆరుతడి పంటల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను కేంద్ర ప్రభుత్వానికి వివరించి నిధులు రాబట్టేందుకు త్వరలోనే ఉన్నతస్థాయి బృందాన్ని ఢిల్లీకి పంపుతామన్నారు.

**10 నెలలు తాగునీటికే ప్రాధాన్యం: సీఎస్ సంజయ్ జాజు**

రాష్ట్రంలో ఇప్పటికే 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. కృష్ణా బేసిన్‌లో 270 టీఎంసీలకు గాను కేవలం 80 టీఎంసీలు, గోదావరి బేసిన్‌లో 150 టీఎంసీలకు గాను 100 టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరిందన్నారు. ఈ నేపథ్యంలో రానున్న 10 నెలల పాటు వ్యవసాయానికి సాగునీరు అందించే పరిస్థితి ఏమాత్రం లేదని, ప్రాజెక్టుల్లోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకే కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. జలాశయాల్లో నీటిమట్టాలు గణనీయంగా తగ్గడంతో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి 25 శాతానికి పడిపోయిందని, దేశవ్యాప్తంగా కూడా విద్యుత్ కొరత తీవ్రంగా ఉందని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. సాధారణం కంటే ఉష్ణోగ్రతలు 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు నీటి వాడకం తక్కువగా ఉండే పెసలు, మినుములు, శనగలు, వేరుశనగ వంటి పప్పు దినుసులు, పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమ వంటి నూనెగింజల సాగుపైనే దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని 1.39 కోట్ల మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఎమర్జెన్సీ క్యాంపుల ద్వారా తాగునీరు, పశుగ్రాసం అందిస్తామని పశుసంవర్ధక శాఖ ప్రకటించింది.

# ఆరు లేన్లుగా ఎన్ హెచ్-65!

**హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణపై చర్చలు**

**ఢిల్లీలో ఎన్ హెచ్ ఏ ఐ చైర్మన్‌తో మంత్రి భేటీ**

**వెంటనే పనులు ప్రారంభించాలని వినతి**

**రోడ్డు ప్రమాదాల నివారణకే తొలి ప్రాధాన్యం**

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12 :** హైదరాబాద్- విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్ హెచ్-65) విస్తరణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. ఈ మేరకు దిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ ఏ ఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్, ప్రాజెక్టుల సభ్యుడు విప్నేష్ శర్మతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కీలక ప్రాజెక్టుపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ జాతీయ రహదారిపై రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా మార్చడంతో పాటు, ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. నియంత్రిత ప్రవేశ సౌకర్యాలను అభివృద్ధి చేస్తే ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయని వివరించారు. మంత్రి విజ్ఞప్తిపై ఎన్ హెచ్ ఏ ఐ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టు టెండర్ల దాఖలుకు నవంబర్ 11 ఆఖరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. 2027 జనవరి నాటికి కచ్చితంగా పనులను ప్రారంభిస్తామని మంత్రికి సంతోష్ కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు.

**కేంద్రంతో నిరంతర సమన్వయం**

ప్రజల ప్రాణాలను కాపాడటం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని కోరినట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేసే ఈ ఎన్ హెచ్-65 విస్తరణ పనులు సకాలంలో పూర్తయ్యేలా కేంద్ర సంస్థలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# మరో స్వాతంత్ర్య పోరు!

- 'నాడు సైమన్ గో బ్యాక్.. నేడు 'జ్ఞానేశ్ గో బ్యాక్'
- ఇప్పటికే 13 కోట్ల ఓట్ల తొలగింపు.. 20 కోట్లకు పెంచే యత్నం
- ప్రభుత్వాలను ప్రశ్నించేవారి ఓట్లు గల్లంతు చేస్తున్నారు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12 :** దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ కల్పించేందుకు నాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'వోటు బచావో.. దేశ్ బచావో' ఆందోళనలో భాగంగా సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'సర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీఎం అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 1950లో నెహ్రూ హయాంలో వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించగా.. ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో ప్రధాని, సీజేఐ, ప్రతిపక్ష నేత ఉండేవారని, 2023లో మోదీ ప్రభుత్వం సీజేఐ స్థానంలో హోంమంత్రిని చేర్చిందని విమర్శించారు. తమకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకునేందుకే ఈ మార్పులు చేశారని, జ్ఞానేశ్ కుమార్ నియామకంపై రాహుల్‌గాంధీ ముందే అభ్యంతరం వ్యక్తం చేశారని గుర్తు చేశారు.

**ప్రశ్నించేవారి ఓట్లు గల్లంతు!**

సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాదాన్ని రాహుల్ గాంధీ ముందుగానే పసిగట్టారని చెప్పారు. ప్రస్తుతం ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి లాంటి వారు కూడా గొంతెత్తుతున్నారని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ నియామకంలో కుట్ర లేకపోతే, ఆయన్ను తొలగించాలన్న డిమాండ్లపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపడితే ఢిల్లీలో భారీగా పోలీసులను మోహరించి ఎందుకు అణచివేస్తున్నారో చెప్పాలన్నారు.

**13 కోట్ల ఓట్ల తొలగింపు..**

2014లో దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2019 నాటికి 91 కోట్లకు, 2024 నాటికి 97 కోట్లకు చేరారని సీఎం వివరించారు. కానీ 2026లో ఇప్పటికే ఏకంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, దీన్ని 20 కోట్లకు పెంచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తక్షణమే స్పందించాలని కోరారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.



**పేదలను రెండో తరగతి పౌరులుగా మార్చే యత్నం**

దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అనే రెండు వర్గాలను సృష్టిస్తున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. సంపన్నులు బీజేపీకి మద్దతుగా ఉంటారని, పేదలు వ్యతిరేకంగా ఉంటారనే రాజకీయ లెక్కలతోనే పేదల ఓట్లకు గండికొడుతున్నారని ఆరోపించారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా దళితులు, గిరిజనులు, పేదలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# బీజేపీ కోసమే ఎస్ఐఆర్ కుట్ర!

- ఎన్నికల సంఘం ద్వారా అక్రమాలు భట్టి
- దేశ పౌరుల ఓటు హక్కు రక్షణే కాంగ్రెస్ లక్ష్యం
- ఢిల్లీ నిరసనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12 :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మాత్రమే గెలిచేందుకు అవకాశం ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ పౌరుల ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు ఢిల్లీలో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యానికి పౌరుల ఓటు హక్కే అత్యంత బలమైన పునాది అని భట్టి పేర్కొన్నారు. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రాథమిక రాజ్యాంగ హక్కును కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముసుగులో ఓటు హక్కుకు విఘాతం కలిగించేలా అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థలో కేవలం బీజేపీ మాత్రమే గెలిచే పరిస్థితులను కల్పించేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రమాదాన్ని కాంగ్రెస్ అగ్రనేత



రాహుల్ గాంధీ ముందుగానే గుర్తించి దేశ ప్రజల దృష్టికి తెచ్చారని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ పోరాటం కాంగ్రెస్ పార్టీకి లేదా తమ నాయకుల ఓట్ల కోసం మాత్రమే కాదని, దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**గాంధేయ మార్గంలో సత్యాగ్రహం**

ఓటర్ల హక్కులకు సంబంధించిన సమస్యలను వివిధ రాజ్యాంగ సంస్థల దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రయత్నించిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలోనే రాష్ట్రపతిని కలిసి వినతులు సమర్పించడంతో పాటు సంబంధిత వ్యవస్థల దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మరో రాజ్యాంగ వ్యవస్థ దృష్టికి ఓటు హక్కుల పరిరక్షణ అంశాన్ని బలంగా తీసుకెళ్లేందుకు ఢిల్లీలో శాంతియుతంగా, గాంధేయ మార్గంలో సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో తెలంగాణ నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారితో పాటు మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ తదితర అనుబంధ సంఘాల శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ప్రజాస్వామ్య పరిరక్షణకు, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# తెలంగాణకు జపాన్ ప్రతినిధులు!

- అసెంబ్లీకి హిరోషిమా బృందం
- ఘన స్వాగతం పలికిన స్పీకర్, చైర్మన్
- శాసనసభలో ప్రత్యేక సమావేశం
- స్నేహ సంబంధాలపై కీలక చర్చలు

**హైదరాబాద్, అక్టోబర్ 12 :** ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతానికి అంతర్జాతీయ శాసనసభల మధ్య పరస్పర సహకారం ఎంతో అవసరమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. జపాన్‌కు చెందిన హిరోషిమా ప్రిఫెక్చురల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధుల బృందం సోమవారం తెలంగాణ అసెంబ్లీని సందర్శించింది. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

**హిరోషిమా పట్టుదల స్ఫూర్తిదాయకం**

భారత్, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు పరస్పర విశ్వాసానికి ప్రతీకలని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక



అభివృద్ధి, క్రమశిక్షణలో జపాన్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ కూడా ఐటీ, ఫార్మా, వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వేగంగా దూసుకెళ్తోందని వివరించారు. రెండో ప్రపంచ యుద్ధంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొన్న హిరోషిమా.. తిరిగి పునర్నిర్మాణం సాధించిన తీరు ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు తెలంగాణలో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

**పెట్టుబడులకు అపార అవకాశాలు**

రెండు దేశాలు ప్రజాస్వామ్య విలువలు, శాంతి, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని స్పీకర్ ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయిలో ఐటీ, ఫార్మా, పరిశోధన రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. జపాన్‌కు చెందిన పారిశ్రామిక సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. ముఖ్యంగా ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ తదితర రంగాల్లో జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

**అనుభవాల మార్పిడి జరగాలి**

రెండు ప్రాంతాల శాసనసభల మధ్య ప్రతినిధుల పర్యటనలు, అధ్యయన కార్యక్రమాలు, పరస్పర చర్చలు మరింత విస్తరించాలని నేతలు ఆకాంక్షించారు. విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తల మార్పిడి పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ సెక్రటరీ రెండ్ల తిరుపతి, జపాన్ ప్రతినిధుల బృందం సభ్యులు, అసెంబ్లీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జపాన్‌తో జతకడతాం!

**సచివాలయంలో మంత్రి వివేక్, సీఎస్ సమీక్ష**

**పెట్టుబడులు, ఉపాధి కల్పనపై కీలక చర్చలు**

**జపాన్ సంస్థలకు సర్కారు పూర్తి మద్దతు**

**గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని సీఎస్ ఆహ్వానం**

**హైదరాబాద్, అక్టోబర్ 12 :** రాష్ట్రానికి, జపాన్‌లోని హిరోషిమా ప్రభుత్వానికి మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆకాంక్షించారు. సచివాలయంలో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం సీఎస్ సంజయ్ జాజు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను జపాన్ ప్రతినిధులకు వివరించారు.

**3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం**

తెలంగాణ విజన్ 2047లో భాగంగా, రాబోయే పాతికేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు. పెట్టుబడులకు అనుకూలమైన క్యూర్ (పట్టణ), ప్యూర్ (నగర పరిసర), రేర్ (గ్రామీణ) రీజియన్ల అభివృద్ధి, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం, ఓఆర్ఆర్ చుట్టూ వాణిజ్య అవకాశాలు, డేటా సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలను ప్రతినిధులకు వివరించారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు తగ్గట్లు యువతకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పనపై ఫోకస్ పెట్టినట్లు చెప్పారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే 'ఇన్వెస్ట్ తెలంగాణ' కార్యక్రమానికి రావాలని హిరోషిమా ప్రతినిధులను, పారిశ్రామికవేత్తలను సీఎస్ ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే జపాన్ సంస్థలకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# కరువు వదిలేసి.. ఢిల్లీకెళ్తారా?

- రైతుల కష్టాలు గాలికి.. సీఎం టూర్
- పొన్నం ఆరోపణలను రుజువు చేయాలి
- పది మంది బాధితులనైనా తీసుకురావాలి
- నిరూపించకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 12:** రాష్ట్రంలో ఎల్–నినో ప్రభావంతో తీవ్ర కరువు నెలకొని రైతులు అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అత్యవసర కేబినెట్ భేటీని రద్దు చేసుకుని ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లడం బాధ్యతారాహిత్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఓట్లు గల్లంతయ్యాయంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలను రామచందర్ రావు తిప్పికొట్టారు. "వేల మంది అవసరం లేదు.. కనీసం ఓట్లు కోల్పోయిన 10 మందిని సీఈవో ఆఫీసుకు తీసుకువస్తే రికార్డులు పరిశీలించేందుకు తాను సిద్ధంగా ఉన్నాను" అని సవాల్ విసిరారు. నోటీసు ఇవ్వకుండా, సరైన విచారణ జరపకుండా ఏ ఒక్క ఓటూ డిలీట్ కాదన్నారు. అర్హులైన వారి ఓటు తొలగించబడిందని నిరూపిస్తే అక్కడికక్కడే నమోదు చేయిద్దామని, ఒకవేళ నిరూపించలేకపోతే కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గోవా పర్యటనలో బీజేపీని రావణుడితో, కాంగ్రెస్‌ను రాముడితో సీఎం రేవంత్ రెడ్డి పోల్చుకోవడం హాస్యాస్పదమని రామచందర్ రావు మండిపడ్డారు. "గతంలో శ్రీరాముడు కాల్పనిక పాత్ర అని కోర్టులో అఫిడవిట్ వేసిన కాంగ్రెస్ పార్టీకి రాముడి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. 'ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం' అని గతంలో చెప్పిన రేవంత్ రెడ్డికి రాముడి పేరు ఎత్తే అర్హతే లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

### రాహుల్‌ను అడ్డుకుంటాం

రాష్ట్రంలో గంజాయి, కొకైన్, ఎండీఎంఏ వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా దొరుకుతూ తెలంగాణ డ్రగ్స్ మార్కెటింగ్ సెంటర్‌గా మారిందని ఆయన ఆరోపించారు. వీటిని కట్టడి చేయలేని ముఖ్యమంత్రి పక్క రాష్ట్రాల్లో నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను రైతులు, దళితులు, బీసీలకు అమలు చేసే వరకు రాహుల్ గాంధీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. ప్రజా జీవితంలో ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల (గుజరాత్ సీఎంగా 12.5 ఏళ్లు, ప్రధానిగా 12 ఏళ్లు) నిస్వార్థ సేవలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ బీజేపీ పక్షాన ఆయనకు అభినందనలు తెలుపుతూ ప్రత్యేక తీర్మానం చేసినట్లు చెప్పారు. గత పన్నెండున్నర ఏళ్లలో కేంద్రం తెలంగాణ అభివృద్ధికి రూ.13 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని రామచందర్ రావు గుర్తు చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్.గౌతంరావు, వీరేందర్ గౌడ్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షల లంచం తీసుకుంటూ సర్వేయర్ అరెస్ట్!

- భూ సర్వే నివేదిక కోసం రూ.30 లక్షలు డిమాండ్
- బేరసారాలతో రూ.20 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్న అధికారులు
- తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాలతోనే లంచం.. ఇద్దరి అరెస్ట్
- నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు నిందితులు



**రంగారెడ్డి, అక్టోబర్ 12:** భూ సర్వే నివేదిక జారీ చేసేందుకు ఏకంగా రూ.20 లక్షలు లంచం తీసుకుంటున్న మండల సర్వేయర్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ భారీ అవినీతి వ్యవహారంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించిన అధికారులు ఆయనను కూడా అరెస్ట్ చేశారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం భూమిని సర్వే చేసి, జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక ఇచ్చేందుకు సదరు అధికారులు ఈ భారీ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. ఏసీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం.. భూ సర్వే నివేదిక జారీ చేసేందుకు నిందితులు మొదట రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. అనంతరం బాధితుడితో బేరసారాలు ఆడి చివరికి రూ.20 లక్షలకు అంగీకరించారు. తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులు ఫిర్యాదుదారుడి నుంచి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచంగా తీసుకున్న రూ.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదు తీసుకున్న సర్వేయర్ చేతి వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### ప్రత్యేక కోర్టులో హాజరు

ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న సర్వేయర్ బటుక శ్రీనివాసులు, తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. ఇద్దరినీ హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపింది. ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచామని, ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ విధుల్లో ఉంటూ ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేసి అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువే!

**ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యుత్, నీటి కొరత**

**మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్**

**రైతుల సమస్యలు వదిలేసి ఢిల్లీకి ముఖ్యమంత్రి, మంత్రులు**

**పంటలు వేయొద్దనడం కాదు.. ప్రత్యామ్నాయం చూపించాలి**

**తాగు, సాగు నీటిని పక్కనపెట్టి బీర్ కంపెనీలకే ప్రాధాన్యం**

**హైదరాబాద్, అక్టోబర్ 12:** రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్–నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బొగ్గు, విద్యుత్, నీటి కొరతకు ప్రభుత్వ అసమర్థతే కారణమని ఆరోపించారు. రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని చెప్పి పదే పదే రద్దు చేయడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని హరీశ్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు రైతుల సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీ పర్యటనలకు, రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. తొమ్మిది నెలలుగా ఎల్–నినో హెచ్చరికలు ఉన్నా ప్రభుత్వం నిద్రపోయిందన్నారు. యాసంగిలో పంటలు వేయొద్దంటూ రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడం కాదు, రైతులు, రైతు కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపాలని డిమాండ్ చేశారు.



### ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

బొగ్గు లేదంటే ఎల్–నినో, కరెంట్ లేదంటే ఎల్–నినో అంటున్నారని.. అసలు బొగ్గు కొరతకు ఎల్–నినోకు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఆరోపించారు. కృష్ణా నీళ్లను 700 కి.మీ దూరంలోని కుప్పానికి తరలిస్తుంటే, ఇక్కడ దేవాదుల, కల్వకుర్తి మోటార్లు ఎందుకు నడపడం లేదని నిలదీశారు. ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్లే పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగూరు ప్రాజెక్టును మరమ్మతుల పేరుతో ఖాళీ చేసి ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు.

### బీర్లకే నీళ్లా? రైతులపై కేసులా?

తాగు, సాగు నీటి అవసరాలను పక్కనపెట్టి బీర్, లిక్కర్ కంపెనీలకు మాత్రం దసరా కోసం ప్రాధాన్యతనిస్తూ నీళ్లు ఇస్తున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. జూరాల వద్ద ఎండిపోతున్న పంటల కోసం నీళ్లు వాడుకున్న 14 మంది రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుల చేతులకు బేడీలు వేస్తారా అని ప్రశ్నించారు. ఆగస్టు నుంచి రైతు బీమా నిలిచిపోయిందని, చనిపోయిన రైతుల కుటుంబాలకు పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను భయపెట్టడం మాని, వారికి అండగా నిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సంజయ్, మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీ ధారణ.. గొప్ప అదృష్టం!

**పోలీసు యూనిఫాం దక్కడం అరుదైన అవకాశం**

**రోజుకు 50 మంది కన్నీళ్లు తుడిచే భాగ్యం**

**రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలి**

**డీఎస్పీల పరేడ్‌లో డీజీపీ సీవీ ఆనంద్**

**హైదరాబాద్, అక్టోబర్ 12:** రాష్ట్ర జనాభాలో పోలీసు యూనిఫాం ధరించే అవకాశం కేవలం సున్నా పాయింట్ మూడు శాతం మందికే దక్కుతుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఇది ఎంతో గొప్ప అదృష్టమని, నిత్యం కనీసం యాభై మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు మాత్రమే లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ నూతన అధికారులనుద్దేశించి ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల తీరు కూడా మారిందని, ముఖ్యంగా సైబర్ నేరాలను దీటుగా ఎదుర్కోవాలని డీజీపీ సూచించారు. కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థాగత మార్పులు చేశామన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, ఫిట్‌నెస్ వృత్తి జీవితం ముగిసే ముప్పై ఏళ్ల వరకు కొనసాగాలని ఆకాంక్షించారు. నిజాయతీగా, నైతిక విలువలతో ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ.. అత్యవసర సేవలకు ఉపయోగించే 112 నంబర్‌కు, ప్రజా సేవలోకి అడుగుపెడుతున్న 112 మంది డీఎస్పీలకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఈ బ్యాచ్‌లో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారని వివరించారు. ఎంతో మంది ఉన్నత విద్యావంతులు ఈ బ్యాచ్‌లో ఉన్నారని కొనియాడారు.



### నేహా అగర్వాల్‌కు సీఎం రివాల్వర్

శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా అధికారి నేహా అగర్వాల్ ఏకంగా ముఖ్యమంత్రి రివాల్వర్‌తో పాటు బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్ తదితర నాలుగు పురస్కారాలు అందుకున్నారు. ఔట్‌డోర్ సబ్జెక్టుల్లో ఎల్.శ్రీకాంత్ డీజీపీ ట్రోఫీ, ఫైరింగ్‌లో టి.జాకబ్ అభిషేక్ ఉత్తమ పురస్కారం దక్కించుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో డి.చందన, క్రిమినాలజీలో ఆదిశేషురెడ్డి, దర్యాప్తులో ఆర్.సాయి కిరణ్ రెడ్డి ప్రతిష్ఠాత్మక పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, అకాడమీ సిబ్బంది, నూతన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్ర!

**ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థలపై కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు**

**'ఇండి' కూటమిపై తీవ్రస్థాయిలో మండిపడ్డ బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

**దొంగ ఓట్ల ఏరివేతపై అభ్యంతరాలు ఎందుకని నిలదీత**

**కాంగ్రెస్‌ది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన నల్ల చరిత్ర అని విమర్శ**

**హైదరాబాద్, అక్టోబర్ 12:** ఎన్నికల్లో ప్రజా మద్దతు పొందలేక రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థలపై నిరాధార ఆరోపణలు చేస్తూ, ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్రలకు కాంగ్రెస్ పార్టీ, 'ఇండి' కూటమి తెరలేపిందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. గతంలో మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, కేరళ తదితర రాష్ట్రాల్లో లక్షలాది బోగస్ ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని కాంగ్రెస్, ఆప్ నేతలే ఎన్నికల సంఘానికి వినతిపత్రాలు ఇచ్చారని లక్ష్మణ్ గుర్తుచేశారు. ఆనాడు దొంగ ఓట్లను ఏరివేయాలని డిమాండ్ చేసి, ఇప్పుడు చట్టబద్ధంగా సమగ్ర సవరణ ప్రక్రియ చేపడితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ వీధుల్లోకి రావడం వారి అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. చనిపోయిన వారి ఓట్లను, డబుల్ ఎంట్రీ ఉన్న ఓట్లను తొలగిస్తుంటే అడ్డుపడటం వెనుక దొంగ ఓట్లతో గెలవాలనే కాంగ్రెస్ దురుద్దేశం ఉందని ఆయన విమర్శించారు. ఓటర్ల సవరణ ప్రక్రియను సుప్రీంకోర్టు స్వయంగా సమర్థించినప్పటికీ, దాదాపు 42 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు కాంగ్రెస్ నిరాధార ఆరోపణలను తప్పుపట్టినప్పటికీ వారి తీరు మారలేదని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ముందే ధర్నాలు చేస్తామని ప్రకటించడం న్యాయ వ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేయడమేనని దుయ్యబట్టారు. 1957 బెగుసరాయ్ బూత్ క్యాప్చరింగ్ నుంచి 1975 నాటి ఎమర్జెన్సీ విధింపు, ఆర్టికల్ 356 దుర్వినియోగం, ఎంపీల కొనుగోలు వరకు కాంగ్రెస్‌ది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన నల్ల చరిత్ర అని విమర్శించారు. తెలంగాణలో తీవ్ర వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి, సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ రాక రైతాంగం సంక్షోభంలో ఉంటే, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. అధిష్టానం మెప్పు కోసం ఢిల్లీ ధర్నాల పేరిట నాటకాలు ఆడుతున్నారని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఓట్ల సవరణ ప్రక్రియ అంతా స్థానిక ప్రభుత్వ ఉద్యోగులు, అన్ని పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సమక్షంలోనే జరిగిందని స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషన్ సవరణ ప్రక్రియపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు.



# అసెంబ్లీలో బతుకమ్మ సంబరాలు!

**ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ.. అసెంబ్లీలో ఘనంగా పూల పండుగ**

**పాల్గొన్న స్పీకర్, మండలి చైర్మన్.. ఆడిపాడిన మహిళా సిబ్బంది**



**హైదరాబాద్, అక్టోబర్ 12:** బతుకమ్మ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్, చైర్మన్ సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పాల్గొని ఆడపడుచులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు తదితర పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి మహిళా సిబ్బంది 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ పాటలు పాడుతూ ఆడిపాడారు. ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలతో అసెంబ్లీ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. రంగురంగుల పూలతో, ఆడపడుచుల ఆనంద కోలాహలంతో ప్రాంగణం అంతా కళకళలాడింది. ఈ వేడుకల్లో శాసనమండలి సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ సెక్రటరీ ఆర్.తిరుపతి, ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ములుగుకు రూ.3 కోట్లు!

**విద్యుత్ లైన్ల మార్పునకు నిధులు.. మంత్రి సీతక్క విజ్ఞప్తికి ఆమోదం**

**గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన డిప్యూటీ సీఎం.. హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

**ములుగు, అక్టోబర్ 12:** ములుగు నియోజకవర్గ ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చేసిన విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. నివాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లను ఇతర ప్రాంతాలకు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.3 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. నివాస ప్రాంతాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రమాదాల ముప్పు పొంచి ఉండటాన్ని మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రాణాపాయ ప్రమాదాలను అరికట్టేలా విద్యుత్ లైన్లను మార్చేందుకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తిపై ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ములుగు నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను గుర్తించి, పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన మంత్రి సీతక్క చొరవతో నియోజకవర్గ ప్రజలకు పెద్ద ప్రయోజనం చేకూరనుంది. తమ దశాబ్దాల కష్టాన్ని తీర్చిన మంత్రి సీతక్కకు ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# జంతర్ మంతర్‌లో నిరసనలకు ఇక చోటులేదా?

## నిరసన వేదికల జాబితా నుంచి తొలగించినట్లు ప్రచారం

## కేంద్ర హోంశాఖ నిర్ణయంతో ఢిల్లీలో కొత్త చర్చ

### రామ్‌లీలా, బురాడీ, సీబీడీ మైదానాలు ప్రత్యామ్నాయాలుగా సూచన

### పార్లమెంటుకు సమీపంలోని నిరసన వేదికపై ఆంక్షల వివాదం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 :** దేశ రాజధాని ఢిల్లీలో దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలకు, నిరసన ప్రదర్శనలకు కేంద్రంగా నిలిచిన జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన వేదికల జాబితా నుంచి తొలగించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇకపై జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతి ఉండదని, ఢిల్లీలోని మూడు ఇతర ప్రాంతాలను ఆందోళనల కోసం కేటాయించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ మార్పులకు సంబంధించిన అధికారిక ఉత్తర్వుల వివరాలు స్పష్టంగా వెల్లడికావాల్సి ఉంది. అందుతున్న సమాచారం ప్రకారం నిరసన ప్రదర్శనల కోసం రామ్‌లీలా మైదానం, బురాడీ మైదాన్, సీబీడీ గ్రౌండ్‌లను ప్రత్యామ్నాయ ప్రాంతాలుగా సూచించినట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్ వద్ద నిరసనల నిర్వహణపై ఆంక్షలు విధించినట్లయితే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆందోళనలపై ప్రభావం పడే అవకాశముంది. దేశ రాజధానిలోని జంతర్ మంతర్ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రముఖ వేదికగా గుర్తింపు పొందింది. పార్లమెంటుకు సమీపంలో ఉండటంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజాసంఘాలు, ఉద్యమకారులు తమ డిమాండ్లను వినిపించేందుకు ఈ ప్రాంతాన్ని ఎంచుకునేవారు. రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళా సంఘాలు సహా అనేక వర్గాలు ఇక్కడ నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించారన్న ప్రచారం నేపథ్యంలో నిరసన తెలిపే హక్కు, ప్రజాస్వామ్యంలో ఆందోళనల ప్రాధాన్యం వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. ప్రత్యామ్నాయంగా సూచించిన ప్రాంతాలు పార్లమెంటుకు దూరంగా ఉండటంతో ప్రజా సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం మరింత కష్టమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటన్నది అధికారిక వివరణ ఆధారంగానే నిర్ధారించాల్సి ఉంది. జంతర్ మంతర్ వద్ద నిరసనల నిర్వహణపై గతంలోనూ వివిధ ఆంక్షలు, నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ప్రజల నిరసన తెలిపే హక్కుతోపాటు స్థానిక నివాసితుల ఇబ్బందులు, శాంతిభద్రతలు, ప్రజా రవాణా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందనే చర్చ అప్పటినుంచే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ అధికారిక హోదాపై తాజాగా వెలువడుతున్న వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిరసనలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు జరిగితే వాటి అమలు విధానం, అనుమతుల ప్రక్రియ, ప్రత్యామ్నాయ వేదికల సౌకర్యాలపై స్పష్టత అవసరమవుతుంది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పరిరక్షిస్తూనే శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ యంత్రాంగం ముందున్న ప్రధాన అంశంగా నిలుస్తుంది.

# ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది

### నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ హోదాను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందించారు. ఇప్పుడు దేశమంతా 'జంతర్ మంతర్' అవుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'వారు (కేంద్రం) జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన స్థలం జాబితా నుంచి తొలగించారు. అవును, అది ఇకపై నిరసన స్థలం కాదు. ఏదేమైనా ఒక పిరికి నియంత దానిని యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది' అని అందులో పేర్కొన్నారు. అలాగే, ఈ రోజు జంతర్ మంతర్‌కు ఉన్న 'నిరసన ప్రదేశం' హోదాను ప్రధాని మోదీ రద్దు చేశారని, రేపు ఆయన ప్రజాస్వామ్యాన్నే రద్దు చేస్తారని మరో పోస్ట్‌లో మండిపడ్డారు. 'ఆ నియంతకు అసలు సమస్య నిరసన ప్రదేశం కాదు. ప్రజలు నిరసన తెలపడం అనే భావనే ఆయనకు సమస్య' అని విమర్శించారు. కాగా, జంతర్ మంతర్‌ను నిరసనలకు నిర్దేశిత ప్రదేశంగా గుర్తించే హోదాను రద్దు చేస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కు మార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'కమిటీ సిఫార్సుల ఆధారంగా, నిరసన వేది కగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేశారు. నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానం అనే మూడు కొత్త ప్రదేశాలను నిర్దేశించారు' అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మూడు కొత్త ప్రదేశాలలో నిరసనలు నిర్వహించడానికి సంబంధించిన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాలను వేర్వేరుగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మరోవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్) వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలను ఉధృతం చేశాయి. దీంతో గత రెండు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్కడకు చేరుకుంటున్న నిరసకారు లను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ గుర్తింపును రద్దు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

# దద్దరిల్లిన ఢిల్లీ!

- ఓటర్ల జాబితాలో గోల్‌మాల్‌పై ప్రతిపక్షాల కదం
- నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ



- 'ఓట్ల చోరీ' ఆరోపణలపై ప్రతిపక్షాల ఆందోళన
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ
- కన్నాట్ ప్లేస్ నుంచి మండి హౌస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించినట్లు సమాచారం
- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు విపక్ష న్యాయ బృందం వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 :** ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయంటూ కేంద్ర ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తత నెలకొన్నట్లు సమాచారం. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టినట్లు కథనాలు వెలువడ్డాయి. 'చలో ఢిల్లీ – ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మార్చ్' పేరుతో కన్నాట్ ప్లేస్ నుంచి మండి హౌస్ వరకు ప్రదర్శన నిర్వహించినట్లు పేర్కొంటున్నారు. నిరసనకారులు సుప్రీంకోర్టు వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. కన్నాట్ ప్లేస్, బరాఖంబా రోడ్డు కూడలి వద్ద ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశమైనట్లు అందిన వివరాలు పేర్కొంటున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని కాపాడాలని, ఓటర్ల జాబితాలకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆయన పదవి నుంచి తప్పుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయన్న తమ ఆరోపణలను తీవ్రంగా పరిగణించాలని కోరుతున్నాయి. అయితే ఈ ఆరోపణలు న్యాయపరంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ అంశాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతిపక్షాల తరఫున న్యాయ బృందం చర్యలు చేపట్టినట్లు సమాచారం. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపినట్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన అంశాలపై సిద్ధం చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేసినట్లు ఆ బృందం వెల్లడించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. పిటిషన్ వివరాలు, దానిపై న్యాయస్థానం తీసుకున్న చర్యల విషయంలో అధికారిక ధ్రువీకరణ అవసరం. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై నెలకొన్న వివాదం నేపథ్యంలో ఢిల్లీలో జరిగినట్లు చెబుతున్న ఈ నిరసన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# సుప్రీంకోర్టును రాజకీయాల్లోకి లాగొద్దు!

- ప్రతిపక్ష నేతలకు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టీకరణ
- రాహుల్, ఖర్గేలకు అపాయింట్‌మెంట్ నిరాకరణ
- విచారణలో ఉన్న అంశాలపై రాజకీయ నేతలతో భేటీ సాధ్యం కాదని వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 :** సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగేందుకు ప్రయత్నించవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓట్ల చోరీ ఆరోపణలకు సంబంధించిన అంశాలపై వినతిపత్రం సమర్పించేందుకు కాంగ్రెస్ నేతలు కోరిన అపాయింట్‌మెంట్‌ను ఆయన నిరాకరించినట్లు సమాచారం. న్యాయస్థానంలో ఇప్పటికే విచారణలో ఉన్న అంశాలపై రాజకీయ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కావడం సముచితం కాదని, అలాంటి చర్య అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమవుతుందని ఆయన పేర్కొన్నట్లు కథనాలు వెల్లడించాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పనితీరు, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చర్చించేందుకు సోమవారం సమయం కేటాయించాలని కాంగ్రెస్ నేతలు ప్రధాన న్యాయమూర్తిని కోరినట్లు సమాచారం. ఈ మేరకు ప్రతిపక్ష ఇండియా కూటమి తరఫున వినతిపత్రం సమర్పించేందుకు ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న వ్యవహారాలపై ప్రత్యేక భేటీ నిర్వహించడం సాధ్యం కాదని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేసినట్లు పేర్కొంటున్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఆదివారం రాత్రే ఈమెయిల్ ద్వారా సమాచారం పంపినట్లు జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారని కథనాలు పేర్కొన్నాయి. ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోందని, అలాంటి పరిస్థితుల్లో రాజకీయ నేతలతో ప్రత్యేకంగా సమావేశం కావడం తగదని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటం అత్యంత ముఖ్యమని, ప్రభుత్వ పాలనకు సంబంధించిన ప్రతి అంశంలోనూ న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకులు తమ అభ్యంతరాలను న్యాయపరమైన మార్గాల్లోనే తెలియజేయాలని, అవసరమైతే తగిన పిటిషన్ దాఖలు చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు తలుపులు న్యాయం కోరే ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, అయితే న్యాయస్థానాన్ని రాజకీయ కార్యకలాపాలకు వేదికగా మార్చే ప్రయత్నాలు చేయకూడదని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నట్లు కథనాలు వెల్లడించాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన అంశాలు తదుపరి విచారణకు రానున్నాయని కూడా ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాలపై స్పందించినట్లు తెలుస్తోంది. ఇదే కార్యక్రమంలో 'నీరు–జీవన అమృతం' అనే అంశంపై మాట్లాడుతూ కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేకపోవడం ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. నీటి కాలుష్యాన్ని అరికట్టేందుకు సంబంధిత వ్యవస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

# ఫారం-6 మార్పులకు మేం ఆమోదం ఇవ్వలేదు!

- ఎన్నికల సంఘం వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు కీలక స్పష్టీకరణ
- బీహార్ ఓటర్ల జాబితా కేసు తీర్పు సమయంలో కొత్త ఫారం లేదన్న సీజేఐ
- చట్టబద్ధమైన నిబంధనలు మార్చకుండానే సవరణలంటూ పిటిషనర్ల అభ్యంతరం
- ఫారంలో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలిస్తామన్న ధర్మాసనం
- ఓటర్ల నమోదు ప్రక్రియలో మార్పులపై కొనసాగుతున్న వివాదం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 :** ఓటర్ల నమోదు కోసం వినియోగించే ఫారం-6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందన్న ఎన్నికల సంఘం వాదనపై సర్వోన్నత న్యాయస్థానం కీలక స్పష్టీకరణ ఇచ్చినట్లు సమాచారం. ఫారం-6 సవరణలను తాము ఎక్కడా ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొన్నట్లు న్యాయస్థాన విచారణకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారంపై గతంలో విచారణ జరిగిన సమయంలో కొత్త ఫారం-6 అందుబాటులోనే లేదని ప్రధాన న్యాయమూర్తి గుర్తుచేసినట్లు సమాచారం. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఎన్నికల సంఘం ఏకపక్షంగా మార్పులు చేసిందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఫారం-6లో తీసుకొచ్చిన మార్పులకు న్యాయస్థానం ఇప్పటికే ఆమోదం తెలిపిందన్న ఎన్నికల సంఘం వ్యాఖ్యలను పిటిషనర్లు ప్రస్తావించారు. గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తుత సవరణలకు ఆమోదంగా పరిగణించరాదని వాదించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఓటర్ల నమోదుకు సంబంధించిన చట్టబద్ధమైన నిబంధనల్లో అవసరమైన సవరణలు చేయకుండానే ఫారం-6లో మార్పులు తీసుకొచ్చారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలను పాటించకుండా దరఖాస్తు పత్రంలో మార్పులు చేయడం చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తుతుందని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని వాదించారు. ఈ వాదనల నేపథ్యంలో ఫారం-6 సవరణలకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందన్న అభిప్రాయాన్ని ధర్మాసనం తోసిపుచ్చినట్లు సమాచారం. బీహార్ ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారంపై గతంలో విచారణ జరిగినప్పుడు ప్రస్తుతం వివాదానికి కారణమైన కొత్త ఫారం అందుబాటులో లేదని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నట్లు తెలుస్తోంది. అందువల్ల అప్పటి న్యాయస్థాన ఆదేశాలను కొత్త ఫారానికి ఆమోదంగా చూపడం సరికాదని స్పష్టం చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఫారం-6లో మార్పులు ఎప్పుడు జరిగాయి? ఎవరు ఆ మార్పులు చేశారు? వాటికి సంబంధించి ఎలాంటి అధికారిక నిర్ణయాలు తీసుకున్నారు? అనే అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపినట్లు సమాచారం. సంబంధిత పత్రాలను పరిశీలించిన తర్వాత సవరణల చట్టబద్ధతపై స్పష్టత ఇవ్వనున్నట్లు పేర్కొన్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు విధానంలో తీసుకొచ్చే మార్పులు ఓటర్ల నమోదుపై ప్రభావం చూపే అవకాశముంది. అందువల్ల ఫారంలో మార్పులు చేసేటప్పుడు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించారా లేదా అన్న అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సంఘం నిర్ణయాలపై పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలు, వాటిపై న్యాయస్థానం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఫారం-6 వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. సంబంధిత రికార్డుల పరిశీలన అనంతరం సుప్రీంకోర్టు ఇచ్చే స్పష్టత ఈ వ్యవహారంలో కీలకం కానుంది.

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

## అనారోగ్యంతో తీవ్ర మనస్తాపం.. ధర్మారంలో విషాదం..



**దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 12, :**

మద్యానికి బానిసై అనారోగ్యానికి గురై తీవ్ర మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మిరుదొడ్డి మండలం ధర్మారంలో చోటుచేసుకుంది. ధర్మారం గ్రామానికి చెందిన కంతుల యాదయ్య (51) గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడని మిరుదొడ్డి ఎస్ఐ సతీష్ తెలిపారు. అనారోగ్య సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన యాదయ్య సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

# ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హైమావతి

## ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :**

కలెక్టరేట్ పక్కన ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోదాంను జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి సోమవారం సందర్శించి, అక్కడి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది విధులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య భద్రపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోదాం వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాల్లో అప్రమత్తంగా ఉంటూ, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

# ఘనంగా దసరా నవరాత్రుల రెండో రోజు వేడుకలు

- కుమారి అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కొలన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవంగా ప్రారంభమైన విజయదశమి మహోత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు కుమారి అమ్మవారి అలంకారంలో చిరునవ్వులు చిందిస్తూ భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. నవరాత్రుల్లో రెండో రోజు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే అవివాహిత యువతీయువకులకు మంచి జీవిత భాగస్వామి లభించి, వివాహాది శుభకార్యాలు సజావుగా జరుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ ప్రగతినగర్ 276వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి) అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మౌలేశ్వరరావు, మధుసూదన్ రెడ్డి, కొలన్ లక్ష్మారెడ్డి, ఏలూరి సత్య (నాని), మేడ శ్రీనివాసరావు, సురేంద్ర కుమార్ యాదవ్, సాంబశివరావు, మహేష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఆదిరెడ్డి, బాలకృష్ణ, మహేష్ యాదవ్‌తో పాటు నిజాంపేట్ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వార్తాలి నూతన వస్త్రాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

- యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోనూ రాణించాలి
- యువకులను అభినందించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 12, :**

యువత ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా వ్యాపార, పారిశ్రామిక రంగాలతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్తాలి వస్త్రాలయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి మండలాలకు చెందిన యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. యువత తమలోని నైపుణ్యాలను ఉపయోగించుకుని వ్యాపార రంగంలో స్థిరపడేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన వార్తాలి వస్త్రాలయాన్ని ప్రజలు సందర్శించి, తమకు అవసరమైన నూతన వస్త్రాలను కొనుగోలు చేయాలని కోరారు.



అనంతరం వస్త్రాలయాన్ని ఏర్పాటు చేసిన యువకులు యాదగిరి, సతీష్, వేణు, రాజులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

# ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు
- ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

**దుబ్బాక ప్రతినిధి, (మిరుదొడ్డి), అక్టోబర్ 12, :**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ, సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక, మిరుదొడ్డి మండల పరిషత్



కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వినోద్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించి, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారి మల్లేశం, ఎంఈఓ ప్రవీణ్ బాబు, ఎస్సై సతీష్, అటవీ శాఖ అధికారి మల్లేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు అవకాశం

- అక్టోబర్ 15 వరకు దరఖాస్తులు
- 13 నుంచి ప్రత్యక్ష ప్రవేశాలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :**

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఆధునిక శిక్షణ కేంద్రాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఐదో విడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు కూకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకట్ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 12 నుంచి 15వ తేదీ వరకు

వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 13 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యక్ష ప్రవేశాలు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. అర్హతలు ఇవే.. సంబంధిత వృత్తి కోర్సుకు నిర్దేశించిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చేతివృత్తి శిక్షణ పథకం కింద ప్రవేశాలకు 2026 ఆగస్టు 1 నాటికి కనీసం 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదని తెలిపారు. ఉచిత నమోదు సదుపాయం.. సాంకేతిక విద్యపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకట్ రమణ సూచించారు. ఐటీఐల్లో అందుబాటులో ఉన్న వివిధ వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు. ఉచిత నమోదు కోసం ఆసక్తి గల అభ్యర్థులు కూకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి హెచ్చరిక
- సోమవారం ప్రజావాణిలో 91 ఫిర్యాదులు స్వీకరణ

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి హెచ్చరించారు. సోమవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా



కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 91 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి ప్రజావాణిలో అందిన దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను జిల్లా అధికారులు శాఖల వారీగా పర్యవేక్షించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ప్రత్యేక ఉప కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :**

బతుకమ్మ పండుగకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఆదేశించారు. సోమవారం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై చేపడుతున్న ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పండుగకు వచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు కట్ట పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల ఏర్పాటు, బతుకమ్మ నిమజ్జనానికి అవసరమైన సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా



నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి , వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే శ్రీరామరక్ష

- అనుమానాస్పద లింకులు, ఓటీపీలతో జాగ్రత్త
- ప్రజలకు సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచన



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ఆర్థిక నష్టానికి దారితీయవచ్చని హెచ్చరించారు. తనకు సైతం ఒకసారి పార్శిల్ పంపిణీ పేరుతో అనుమానాస్పద ఫోన్ కాల్ వచ్చిందని, అలాంటి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని తన అనుభవాన్ని పంచుకున్నారు. తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు, రహస్య సంకేతాలు వెల్లడించవద్దని సూచించారు.

**ఆగండి.. ఆలోచించండి.. ధ్రువీకరించండి..**

అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా ఆగి, వాటి విశ్వసనీయతను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సీపీ సూచించారు. బ్యాంకు ఖాతాలకు బలమైన రహస్య సంకేతాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటిని క్రమం తప్పకుండా మార్చుకోవాలని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. చిన్నపిల్లలు, యువత పెద్దల ఫోన్లు ఉపయోగిస్తున్నప్పుడు తెలియని లింకులు తెరవకుండా, నమ్మదగని అంతర్జాల ఆటలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లోని ఉచిత వైఫై వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద అనువర్తనాలు, వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్త వహించాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం, నివాస చిరునామా, రోజువారీ కార్యకలాపాలు, ప్రయాణ వివరాలను బహిరంగంగా పంచుకోవద్దని తెలిపారు. సామాజిక మాధ్యమ ఖాతాలను సాధ్యమైనంత వరకు వ్యక్తిగతంగా ఉంచుకోవడం ద్వారా ఆన్‌లైన్ మోసాలతో పాటు ఇతర నేరాల ప్రమాదాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు.మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి సైబర్ నేరానికి గురైనప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ నేరాల సహాయ నంబరుకు ఫోన్ చేయాలని లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైమ్.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. బాధితులు సత్వరమే స్పందించి ఫిర్యాదు చేస్తే మోసపోయిన సొమ్మును నిలిపివేయడానికి, తిరిగి పొందేందుకు అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే క్రమంలో వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని ఆమె పేర్కొన్నారు.

# డ్రైవర్‌కు అనారోగ్యం.. ప్రజల కోసం రంగంలోకి సర్పంచ్ భర్త..

- ప్రజాసేవే లక్ష్యంగా పారిశుధ్య బాధ్యతను భుజాన వేసుకున్న సర్పంచ్ భర్త
- ట్రాక్టర్ డ్రైవర్‌కు వైరల్ ఫీవర్.. గ్రామ ప్రజలకు ఇబ్బంది కలగకుండా స్వయంగా సేవల నిర్వహణ

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :** ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉంటే పదవితో సంబంధం లేకుండా బాధ్యతను నిర్వర్తించవచ్చని బక్రీచెప్యాల గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత దంపతులు చాటిచెప్పారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ విధులకు హాజరు కాలేకపోయారు. దీంతో గ్రామంలో పారిశుధ్య పనులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో సోమవారం సర్పంచ్ జక్కుల శ్రీలత తన భర్త జక్కుల శ్రీనివాస్‌ను సేవల నిర్వహణకు ముందుకు తీసుకొచ్చారు. గ్రామ ప్రజలకు అసౌకర్యం కలగకుండా సేవలు కొనసాగించేందుకు వారు చూపిన చొరవపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, గ్రామ అవసరాలకు ప్రాధాన్యమివ్వడమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనం. పదవి అనేది హోదా కోసం కాదు.. ప్రజలకు అండగా నిలిచేందుకు అనే సందేశాన్ని ఈ ఘటన చాటిచెబుతోంది. ఇలాంటి ప్రజాసేవా దృక్పథం ఉన్నవారిని నాయకులుగా ఆదరించండి. ప్రజల అవసరాలను గుర్తించి,



కష్టసమయంలో ముందుకొచ్చే నాయకత్వం ఉంటే గ్రామానికి ఎన్నో విధాలుగా మేలు జరుగుతుంది. ప్రజల పట్ల బాధ్యత, సేవాభావం ఉన్నవారిని ప్రోత్సహించడం మనందరి బాధ్యత.

# మహిళల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ చీరలు

- అక్కాచెల్లెళ్లకు రేవంతన్న కానుక
- నసీర్‌నగర్ 29వ వార్డులో ఘనంగా దసరా చీరల పంపిణీ
- 40 మహిళా సంఘాలు.. 400 మంది సభ్యులకు పండుగ కానుక..

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :** మహిళల ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ, పండుగ వేళ ఆడపడుచుల్లో ఆనందాన్ని నింపే లక్ష్యంతో ప్రభుత్వం అందిస్తున్న ఇందిరా మహిళాశక్తి చీరలను సిద్దిపేట పట్టణంలోని నసీర్‌నగర్ 29వ వార్డులో మహిళలకు పంపిణీ చేశారు. దసరా పండుగను పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమం మహిళల్లో సంతోషాన్ని నింపింది. 29వ వార్డులోని 40 మహిళా సంఘాలకు చెందిన 400



మంది సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కో సంఘంలో పది మంది సభ్యులు ఉండగా, మహిళలందరికీ పండుగ కానుకగా చీరలు అందజేశారు. అక్కాచెల్లెళ్లకు ప్రభుత్వం అందిస్తున్న ఈ కానుక పండుగ సంబరాలను మరింత పెంచిందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు ఆర్పీ రేణుక, షహనాజ్, గ్రూప్ లీడర్ షమీం, మీనా, కౌసర్ బేగం, ఖైర్ ఉన్నిసాతో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ, ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబ అభ్యున్నతితో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. మహిళల సంక్షేమం, సాధికారత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు పండుగ వేళ వారి ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తున్నాయని పేర్కొన్నారు. దసరా పండుగ వేళ అక్కాచెల్లెళ్లకు అందిన ఈ చీరల కానుక మహిళల్లో ఆనందోత్సాహాలను నింపింది.

# మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

- శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణకు కరాటే దోహదం

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 12, :** మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలోని సిద్ధార్థ కాన్సెప్ట్ స్కూల్‌లో యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్‌లు, ధ్రువపత్రాలు అందజేశారు. వివిధ బెల్ట్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు: పర్పుల్ బెల్ట్ –విశ్రుద్, బ్లూ బెల్ట్ – రిషి అఖిల్, టీ. సాత్విక్, గ్రీన్ బెల్ట్ – క్రిష్, పి. సాత్విక్, ఆరెంజ్ బెల్ట్ – శిల్పిత, రిషిత, ఎల్లో బెల్ట్ – భవిష్య, నక్షనిహానిష్. ఈ సందర్భంగా బురాని శ్రీకాంత్ మాట్లాడుతూ, కరాటే కేవలం పోరాట విద్య మాత్రమే కాదని, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, క్రమశిక్షణను పెంపొందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణ సామర్థ్యాన్ని పెంచుకో వచ్చన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడలు, ఆత్మరక్షణ శిక్షణలోనూ




ప్రోత్సహించాలని కోరారు. ఈ పరీక్షలు విద్యార్థుల్లో కరాటేపై ఆసక్తిని, మరింత నేర్చుకోవాలనే ఉత్సాహాన్ని పెంచాయని నిర్వాహకులు తెలిపారు.

# అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను వెంటనే పూర్తి చేయాలి

- అధికారులకు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఆదేశాలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెస్ట్ ఎం.ఎన్. రెడ్డి నగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల విషయాన్ని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణం పూర్తయిన అనంతరం కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, చీఫ్ అడ్వైజర్ రాముడు యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ పటేల్, కోశాధికారి రాజు, కాలనీ యువజన అధ్యక్షుడు రాజు యాదవ్, కాలనీవాసులు మురళి, బస్వరాజు, శేఖర్ గౌడ్, నర్సింహ, కృష్ణ, స్థానిక బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, నరేందర్ రెడ్డి, సమ్మెట ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

- శరన్నవరాత్రి వేడుకలకు ఆహ్వానం.. సమస్యల పరిష్కారానికి వినతిపత్రాల సమర్పణ



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాస కార్యాలయంలో సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పూజా కార్యక్రమాలకు హాజరుకావాల్సిందిగా కూన శ్రీశైలం గౌడ్‌ను ఆహ్వానించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం తనవంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతకు బీఆర్ఎస్ అండ

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో రూ.2.20 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓసీ అందజేత



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రజాసేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2,20,000 విలువైన ఎల్ఓసీని జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలోని వెంకన్న హిల్స్ ఫేజ్–2కు చెందిన మునగాల పద్మావతికి బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించి, కష్టకాలంలో వారికి అండగా నిలవడమే బీఆర్ఎస్ ప్రజాసేవ లక్ష్యమని పేర్కొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహకారం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాలె నగేష్, గణేష్, జయంచారి చంద్రశేఖర్ రెడ్డి, బాలమల్లేష్, శ్రీకాంత్ తదితరులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ గౌడ్ కు ఘన సన్మానం

- బీజేపీ సీనియర్ నాయకుడు పెండ్లి మడుగుల శ్రీనివాస్ గౌడ్ ను శాలువాతో సత్కరించిన పార్టీ నాయకులు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు పెండ్లి మడుగుల శ్రీనివాస్ గౌడ్ మియాపూర్, కూకట్‌పల్లి ఈఎక్స్‌ఎఫ్‌సీసీ నంబర్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మండల అధ్యక్షుడు పిసరి కృష్ణారెడ్డి, మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు ఎస్. నర్సింగరావు, అతిష్ బాబు (సోను), మల్లంపేట్ మాజీ కౌన్సిలర్ ఎంబరి అంజనేయులు, 32వ బూత్ ఇన్‌చార్జి గణేష్ ముదిరాజు, సీనియర్ నాయకుడు నవీన్, అఖిలేష్ కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సాయి లక్ష్మీ లేఔట్ పార్కు స్థలంపై విచారణ జరపాలి

- **పార్కు స్థలాన్ని పరిరక్షించాలి.. నిర్మాణాలు నిలిపివేయాలి: జేఏసీ డిమాండ్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** నిజాంపేట్ పరిధిలోని ప్రగతినగర్ సాయి లక్ష్మీ లేఔట్‌లో ఉన్న 1,802.90 చదరపు మీటర్ల పార్కు స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశారు. సాయి లక్ష్మీ లేఔట్ పార్కు స్థలానికి సంబంధించి హెచ్ఎండీఏ అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పార్కు స్థలంలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, స్థలాన్ని ప్రజా అవసరాల కోసం పరిరక్షించాలని కోరారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్కు స్థల పరిరక్షణకు అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే, ఈ నెల 24వ తేదీన భారీ ప్రజా ఉద్యమం చేపడతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆకుల సతీష్, అమలేశ్వరి, బిక్షపతి, రవి నాయక్, గోపాల్ నాయక్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



# నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలి

- **కలెక్టర్ కట్టా హైమావతి**
- **రబీ సీజన్‌లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి**
- **రైతు నేస్తం వీడియో సమావేశంలో ప్రభుత్వ సూచనలు**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి రైతులకు సూచించారు. రబీ సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితర ఉన్నతాధికారులు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల్లోని రైతు వేదికల నుంచి పాల్గొన్న అధికారులు, రైతులతో వారు మాట్లాడి రబీ పంటల ప్రణాళిక, నీటి సంరక్షణ చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిందు సేద్యం ద్వారా పామాయిల్ తోటలు, కూరగాయలు, ఇతర స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు ఏర్పాటు చేయడంతో పాటు బోరుబావుల్లోకి నీరు ఇంకేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 315 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని, కరువు మండలాల ప్రకటనపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.

### రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తాం

హుస్నాబాద్ రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలిసి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ, ప్రభుత్వ సూచనలను అనుసరించి నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రైతులు పంటల సాగులో నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అవసరమైన చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి , వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# ప్రజల సహకారంతోనే డివిజన్ అభివృద్ధి సాధ్యం



- **మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా నిరంతరం ప్రజాసేవలో ఉంటున్నా: మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** ప్రజల సహాయ సహకారాలతోనే డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యమవుతుందని జగద్గిరిగుట్ట డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్, రోడ్డు నంబర్ 16లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలుకుల జగన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని విమర్శించారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని అన్నారు. తనను మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా గెలిపించి ఆదరించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. డివిజన్‌లోని ప్రతి ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం ప్రజాసేవకుడిగా పనిచేస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ కార్యదర్శులు తోక యాదగిరి, వన్నీర్ గణేష్, ఉపాధ్యక్షుడు యెడల సతీష్, కోశాధికారి మనోజ్, స్థానికులు నరసింహారెడ్డి, ప్రభాకర్, ప్రకాష్ ముదిరాజ్, కుమారస్వామి, పెండం మహేష్, ఉదయ్, శాంత తదితరులు పాల్గొన్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన, వాతావరణం పరిస్థితుల అనుగుణంగా పంటలు వేయాలి

**నూతనకల్, అక్టోబర్ 12, :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నూతనకల్ మండలంలోని మిరియాల రైతు వేదిక, తాళ్లసింగారం రైతు వేదిక, దిర్శనపల్లి రైతు వేదికల్లో రైతుల కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫోన్ ద్వారా రైతులకు సందేశాన్ని అందించి, తగిన సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు,



ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిణామాలు, రాబోయే రబీ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో, సునీత మండల వ్యవసాయ అధికారి, సైదా నాయక్ ఏఈ (ఎలక్ట్రికల్), తాళ్లసింగారం గ్రామ సర్పంచ్, బక్కెహెమలతండా గ్రామ సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి లూనావత్ సాయిప్రసాద్, ఏఇఓ లు జానయ్య, సంధ్య, పావని, గ్రామ పంచాయతీ అధికారులు (జీపీఓలు), పంచాయతీ కార్యదర్శులు, సెర్ప్ సిబ్బంది మరియు ఆయా రైతు వేదికల పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కథా రచన పోటీలో డాక్టర్ యశస్వినికి ప్రథమ బహుమతి

- **రూ 30 వేల నగదు పురస్కారం.. కరీంనగర్‌కు గర్వకారణం**

**కరీంనగర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కథా రచన పోటీలో కరీంనగర్‌కు చెందిన యువ పోస్ట్‌గ్రాడ్యుయేట్ వైద్యురాలు డాక్టర్ యశస్విని ప్రథమ బహుమతి సాధించారు. తన వైద్య వృత్తితో పాటు సాహిత్య రంగంలోనూ ప్రతిభను చాటుకుని రూ.30 వేల నగదు పురస్కారాన్ని గెలుచుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భట్రాజు సమాజంలోని ఔత్సాహిక రచయితల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి, వారి కథల ఆధారంగా



లఘు చిత్రాలను నిర్మించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో అమెరికాలో మూడు దశాబ్దాలకు పైగా సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన ఆత్మారామరాజు ఈ పోటీని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ, లఘు చిత్రాల నిర్మాతగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన ఈ పోటీ ద్వారా రచయితలకు మంచి వేదిక కల్పించారు. పాఠశాల విద్యార్థుల నుంచి పెద్దల వరకు మొత్తం 26 మంది ఔత్సాహిక రచయితలు ఈ పోటీలో పాల్గొని తమ రచనా ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు ప్రకటించడం రచయితలను ప్రోత్సహించే గొప్ప ప్రయత్నమని అభినందించారు. కరీంనగర్‌కు చెందిన డాక్టర్ యశస్విని వైద్యురాలిగా నిత్యం రోగులకు సేవలందిస్తూనే, తనలోని సృజనాత్మకతకు పదును పెట్టి కథా రచనలో ప్రథమ స్థానాన్ని సాధించడం విశేషం. వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూనే సాహిత్యంపై ఆసక్తిని కొనసాగిస్తూ విజయాన్ని అందుకోవడం ఆమె పట్టుదలకు, అంకితభావానికి నిదర్శనమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్వినికి రమామహేందర్ రాజు కాసు, కుటుంబ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆమె వైద్య సేవలతో మరెందరికో ఆరోగ్యాన్ని అందించాలని, రచయిత్రిగా మరెన్నో అద్భుతమైన కథలు రాస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే కథా రచన పోటీని నిర్వహించి రచయితలను ప్రోత్సహించిన ఆత్మారామరాజుకు, ఆయన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. పోటీలో పాల్గొన్న రచయితలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 12, :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా విద్యార్థులకు అధికారికంగా సెలవులు ప్రకటించినప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆ సెలవులను పాటించకుండా పాఠశాలలను తెరిచి తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్యుఐ అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ తేజ సంగెపు, దుబ్బాక టౌన్ ప్రెసిడెంట్ అన్వర్ ఖాన్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సెలవులను ప్రతి విద్యాసంస్థ తప్పనిసరిగా పాటించాలని, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ సెలవు రోజుల్లో పాఠశాలలను నిర్వహించే యాజమాన్యాలు వెంటనే తరగతులను నిలిపివేయాలని హెచ్చరిస్తున్నామన్నారు. ఇకపై ప్రభుత్వ సెలవులను పట్టించుకోకుండా పాఠశాలలను నిర్వహించినట్లు మా దృష్టికి వస్తే, సంబంధిత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా కోరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ నాయకులు భరత్, బన్నీ రాకేష్ ప్రేమ్ సుమేర్ భరత్ సీజన్ తదితరులు పాల్గొన్నారు.




# ఎం.ఎన్. రెడ్డి నగర్‌లో మంజీరా లైన్ పనులకు శంకుస్థాపన

- **రూ.6.70 లక్షల వ్యయంతో పనులు ప్రారంభం – బీజేపీ నేత చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ పరిధి ఎం.ఎన్. రెడ్డి నగర్ ఫేజ్–1లో రూ.6.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన మంజీరా వాటర్ లైన్ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ (కుత్బుల్లాపూర్ వార్డు) ఆధ్వర్యంలో మంజూరైన ఈ పనులను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ సింహారెడ్డి మాట్లాడుతూ, కాలనీలోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించడమే ఈ పనుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతంగా, మెరుగైన తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాలనీల అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సంపత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కోశాధికారి కరుణాకర్ రెడ్డి, సహాయ కోశాధికారి బాపిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి గౌడ్, విజయ్,



నార్లకంటి దుర్గయ్య, పెద్దింటి సాయిలు, నర్సింహారెడ్డి, కర్నె శ్యామ్, సతీష్ చక్రవర్తి, విట్టల్, శంకర్, శ్రావణ్ బోస్, శివకృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేష్, శ్రీనివాస్, చిదంబర శాస్త్రి, రాజేష్, ఎల్లా గౌడ్, ప్రసాద్, వినోద్ రెడ్డి, సత్యరామ్, కాశీనాథ్, శివ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో భట్రాజుల సత్తా చాటాలి!

- రాజకీయ, సామాజిక రంగాల్లో రాణిస్తూ ఐక్యతతో ముందుకు సాగాలి: బొల్లెపల్లి సీతారామరాజు
- మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ అభినందన సభ – రాష్ట్రస్థాయి పదవులు చేపట్టిన ప్రతినిధులకు ఘన సన్మానం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** భట్రాజు సమాజం ఐక్యంగా ముందుకు సాగుతూ చట్టసభల్లో తమ గొంతుకను వినిపించాలని, రాజకీయ, సామాజిక రంగాల్లో సత్తా చాటాలని భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొల్లెపల్లి సీతారామరాజు పిలుపునిచ్చారు. సమాజానికి ఉన్న విశిష్టమైన గుర్తింపును కాపాడుకుంటూ, ఐక్యతతో అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన ఆకాంక్షించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని కృషి ఉన్నత పాఠశాలలో ఆదివారం మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం (పశ్చిమ శాఖ) ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన, సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో వివిధ పదవులకు ఎన్నికైన, నియమితులైన ప్రతినిధులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి బొల్లెపల్లి సీతారామరాజుతో పాటు రాష్ట్ర సంఘం సహాధ్యక్షుడు వ్యాసభట్టు వెంకటరమణ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లెపల్లి సీతారామరాజు మాట్లాడుతూ.. భట్రాజు సమాజం పూర్వం నుంచి పండిత సమాజంగా విశిష్ట గుర్తింపును సంపాదించుకుందని పేర్కొన్నారు. ఆ ఘనమైన వారసత్వాన్ని భావితరాలకు అందించడంతో పాటు, సంఘ సభ్యులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటాలని సూచించారు. కులబంధువుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం బలోపేతం కావాలని, రాజకీయాల్లోనూ సముచిత ప్రాతినిధ్యం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భట్రాజు సంఘానికి ప్రాధాన్యతనిస్తూ, సమాజ అభ్యున్నతికి కృషి చేసే ప్రభుత్వాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

**సంఘ సేవకు గుర్తింపు.. రాష్ట్రస్థాయి బాధ్యతలు**

గతంలో జిల్లా అధ్యక్షుడిగా సేవలందించి, తాజాగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ.. గత రెండున్నర దశాబ్దాలుగా సంఘ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తున్నానని తెలిపారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో కీలక బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని, భట్రాజు సంఘ అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని వెల్లడించారు.

**రాష్ట్ర కార్యవర్గంలో బాధ్యతలు చేపట్టిన ప్రతినిధులు**

రాష్ట్రస్థాయిలో వివిధ పదవులకు ఎన్నికైన, నియమితులైన వారిలో కూరపాటి కరుణాకర్ రాజు (రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు), సరికొండ శ్రీనివాసరాజు (కార్యదర్శి), చక్రాల రేవతి నంద్ (మ్యాగజైన్ కమిటీ వైస్ చైర్మన్), తంగెళ్ల రాధాకృష్ణ భట్ (జిల్లా–రాష్ట్ర సంబంధాల కమిటీ వైస్ చైర్మన్), సరస్వతి నరేందర్ రాజు (మీడియా సంబంధాల వైస్ చైర్మన్), శ్రీరామరాజు (కో–కన్వీనర్), తంగెళ్ల సుజాత (రాష్ట్ర మహిళా విభాగం ప్రచార కార్యదర్శి), బొల్లెపల్లి నాగరాజు (యువజన విభాగం ఉపాధ్యక్షుడు), తంగెళ్ల ప్రేమ్ సాయిభట్ (క్రీడల కమిటీ కార్యదర్శి) ఉన్నారు. వీరందరినీ సభలో ఘనంగా సన్మానించి, సంఘ నాయకులు, కులబంధువులు అభినందనలు తెలిపారు.

**సంఘ నాయకులు, మహిళా ప్రతినిధుల హాజరు**

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోలభట్టు కృష్ణంరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పోరంకి శ్యాంప్రసాద్ రాజు, ఉపాధ్యక్షుడు ఊడుమూడి రాఘవరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బల్ల కరుణాకర్ రాజు, కార్యదర్శి భల్లం మౌనిక సాయి, రంగారెడ్డి తూర్పు జిల్లా ఉపాధ్యక్షుడు కూరపాటి శ్యాంమోహన్ రాజు పాల్గొన్నారు. అలాగే సంఘ ప్రతినిధులు వి.వి.ఎల్. నరసింహరాజు, బాహటం కృష్ణార్జునరాజు, మోగసాటి సుధీర్ రాజు, భట్టు ప్రవీణ్ రాజు, పైడికొండల జనార్ధన్ రాజు, సరస్వతి అశోక్ రాజు, వేమరాజు శేషంరాజు, దశరథ దురేందర్ రాజు తదితరులు హాజరయ్యారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏనుగుదాటి పరమేశ్వరి, ఉపాధ్యక్షురాలు కూరపాటి పద్మావతి, కోశాధికారి భల్లం ఉషారాణి, కార్యదర్శి వడాలి సీతతో పాటు పలువురు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. ఐక్యత, సంఘటిత శక్తి, సమాజ అభ్యున్నతి లక్ష్యంగా సాగిన ఈ సభ ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతమైంది.

# ధూలపల్లి రోడ్డు సమస్య పరిష్కారానికి ఎత్తారి మారయ్య చొరవ

- ప్రజావాణిలో కాలనీవాసులతో కలిసి ఫిర్యాదు.. చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ధూలపల్లిలో నెలకొన్న రోడ్డు సమస్య పరిష్కారానికి తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎత్తారి మారయ్య చొరవ తీసుకున్నారు. స్థానిక కాలనీవాసులతో కలిసి సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు పత్రం అందజేసి, రోడ్డు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ధూలపల్లిలో రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పాదచారులు సైతం నడవడానికి అవస్థలు పడుతున్నారని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎత్తారి మారయ్య, రహదారిని అభివృద్ధి చేసి స్థానికులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కొంపల్లి డీసీ, రోడ్డు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎత్తారి మారయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎండమూరి రాజు, లహవీర్ యాదవ్, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.



# గాజులరామారం డివిజన్‌లో పెండింగ్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ప్రజావాణిలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వినతి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కోరారు. ఈ మేరకు సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు స్థానిక బీఆర్ఎస్ నాయకులు కస్తూరి బాలరాజు, తెలంగాణ సాయితో కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల పరిరక్షణకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



**వినతిలో ప్రధానంగా ప్రస్తావించిన పనులు:**

**మహదేవపురం:** ఎస్, ఎక్స్, జె బ్లాకలలో డ్రైనేజీ లైన్లు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ తాగునీటి సరఫరా పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ రోడ్లు నిర్మించాలి.

**మల్లారెడ్డి నగర్ ఫేజ్-1:** డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేసి, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

**మాంట్రిడ్జ్ స్కూల్ సమీపం:** మహదేవపురంలోని పాఠశాల సమీప పార్కు వెనుక భాగంలో రిటైనింగ్ వాల్ నిర్మించాలి.

**మల్లారెడ్డి నగర్:** 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

ఈ పనులు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ స్పందిస్తూ, డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

**జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 12, :** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీఓలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారానికి చర్యలు

- చింతల్ సర్కిల్ ఉప కమిషనర్ హెచ్‌ఎం. స్పందన.. ప్రజావాణికి 11 ఫిర్యాదులు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, :** చింతల్ సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్లలో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి, ప్రజల సహకారంతో ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఉప కమిషనర్ హెచ్‌ఎం. స్పందన తెలిపారు. సోమవారం జగద్గిరిగుట్టలోని చింతల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు మౌలిక వసతులు, పారిశుధ్యం, రహదారులు, పబ్లిక్ పార్కులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు 11 ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిశీలించిన ఉప కమిషనర్ స్పందన, ప్రతి ఫిర్యాదును సంబంధిత విభాగాల అధికారులు క్షుణ్ణంగా సమీక్షించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు, స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సంధ్య, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ కరుణాకర్, డీఈ సాగర్, ఏఈ టీ. విజయ్, ఏఎంహెచ్ఓ కవిత, యూసీడీ సీఓ సురేష్, యూబీడీ సూపర్‌వైజర్ నాగరాణి, సర్కిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# గణేష్ ఫైర్ వర్క్స్ ప్రారంభోత్సవంలో అడువాల జ్యోతి లక్ష్మణ్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :** జగిత్యాల జిల్లా రాజారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గణేష్ ఫైర్ వర్క్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫైర్ వర్క్స్ యాజమాన్యం కోటగిరి అజయ్‌ను ఆమె అభినందించారు. నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభించిన కోటగిరి అజయ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిశాంత్, మిత్రబృందం, ముఖ్య నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# దోనగుట్ట లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో మాజీ మంత్రి సురేఖ ప్రత్యేక పూజలు

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, అక్టోబర్ 12, :** వరంగల్‌లోని న్యూ శాయంపేట ప్రాంతంలో ఉన్న శ్రీ దోనగుట్ట సంతోష లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమం, స్వామివారి కల్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామివారికి విశేష పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ పవిత్ర వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించారు. శ్రీ సంతోష లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి దైవిక వేడుకలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.





# ప్రజలకు సత్వర న్యాయమే లక్ష్యం

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :**
ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# చిన్నారులను ఆశీర్వదించిన అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 12, :**
జగిత్యాల పట్టణం బైపాస్ రోడ్డులోని దేవిశ్రీ గార్డెన్స్‌లో సోమవారం జరిగిన మానాల చందన, మానాల ఆయుష్ చిన్నారుల సారీ, ధోతి వేడుక కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులైన మానాల చందన, మానాల ఆయుష్‌లను ఆమె ఆప్యాయంగా ఆశీర్వదించి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చిన్నారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య జరిగింది.

## మండల ప్రెస్ క్లబ్ టియూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**కొడిమ్యాల, అక్టోబర్ 14, :**
కొడిమ్యాల మండలం ప్రెస్ క్లబ్ టియూడబ్ల్యూజే (ఐజేయూ) విలేకరుల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక సోమవారం జగిత్యాల జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాలచారి, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్ ల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి ఏకగ్రీవ ఎన్నికల్లో అధ్యక్షులుగా కట్టెకోల రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొండూరి ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా కంచర్ల గంగాచారి నియమించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు వెల్లడించారు. పూర్తిస్థాయిలో కమిటీని త్వరలో ఎన్నుకోవడం జరుగుతుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సందర్భంగా తెలిపారు.



# ఘనంగా అర్జున్ యాదవ్ జన్మదిన వేడుకలు



**కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 12, :**
జగదిరిగుట్ట యాదవ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అర్జున్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గండి జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో అర్జున్ యాదవ్ ని జన్మదిన శుభాకాంక్షలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగోళ నాగరాజు, గండి రాజు యాదవ్, కుమార్ యాదవ్, కుర్మయ్య, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భట్రాజులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- **బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలి.. ఏటా రూ.100 కోట్ల నిధులు కేటాయించాలి: చక్రహరి రామరాజు**



**నల్లగొండ, అక్టోబర్ 12, :** భట్రాజు సామాజిక వర్గానికి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తగిన గుర్తింపు కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని భట్రాజు సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు డిమాండ్ చేశారు. భట్రాజు కులాన్ని బీసీ–డీ గ్రూపు నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చాలని, ఆ సామాజిక వర్గ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నల్లగొండలోని బీసీ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్. శంకర్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షిక సదస్సు ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చక్రహరి రామరాజు మాట్లాడుతూ, సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ సమాజానికి విద్యను అందించిన ఘనత భట్రాజు సామాజిక వర్గానికి ఉందన్నారు. అయినప్పటికీ ఈ వర్గానికి సమాజంలో తగిన గుర్తింపు లభించడం లేదని, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు భట్రాజులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. భట్రాజు సామాజిక వర్గం మొదటి నుంచి డీఎన్‌టీ (డీనోటిఫైడ్ ట్రైబ్స్) పరిధిలో ఉందని పేర్కొంటూ, డీఎన్‌టీ కులాలను బీసీ–ఏ గ్రూపులో చేర్చి, భట్రాజు కులాన్ని మాత్రమే బీసీ–డీ గ్రూపులో ఉంచడం అన్యాయమని విమర్శించారు. ఈ నేపథ్యంలో భట్రాజు కులాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భట్రాజు సామాజిక వర్గానికి ప్రత్యేక ఫెడరేషన్ ఉన్నప్పటికీ, దానికి నిధులు కేటాయించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ ద్వారా సామాజిక వర్గ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఏటా కనీసం రూ.100 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వార్షిక సదస్సులో భాగంగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరిస్తున్నట్లు సమావేశంలో వివరించారు. అలాగే వితంతువులకు ఆర్థిక సాయం అందిస్తూ సామాజిక బాధ్యతను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తంగెళ్ల పిచ్చుమ్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాహటం సత్యనారాయణ రాజు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు, కోశాధికారి ధూపాటి సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరాజు, మహిళా సంఘం అధ్యక్షురాలు కూరపాటి రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి బిరుదురాజు కవిత, యువజన సంఘం అధ్యక్షుడు బిరుదరాజు యాదగిరి రాజు, యువజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు అన్వేషరాజు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రత్యేక చొరవ

- **ఉక్రెయిన్ యుద్ధంలో మృతి చెందిన జగిత్యాల యువకుడి కుటుంబానికి సీఎం అండ**
- **రూ.6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి**
- **మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు అధికారులకు ఆదేశాలు**




**హైదరాబాద్ బ్యూరో, అక్టోబర్ 12, :**
రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. సుదర్శన్ గౌడ్ కుటుంబం చేసిన విజ్ఞప్తిపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో, సీఎం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఉపాధి కోసం సుమారు నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన సుదర్శన్ గౌడ్ అక్కడ కొనసాగుతున్న యుద్ధంలో క్షిపణులు, డ్రోన్ దాడుల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదర్శన్ గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### కుటుంబ విజ్ఞప్తిపై మంత్రి ప్రత్యేక చొరవ

సుదర్శన్ గౌడ్ భార్య చేసిన విజ్ఞప్తిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా పరిగణించారు. కుటుంబ పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు. మంత్రి చొరవకు స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే రూ.6 లక్షల సాయం ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు అవసరమైన ఉత్తర్వులు జారీ చేశారు. సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవతో సమస్య ముఖ్యమంత్రి దృష్టికి చేరడం, సీఎం వెంటనే స్పందించి ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల సుదర్శన్ గౌడ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- **బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెరుమాళ్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12, :**
పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారికి సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అధికారులకు సూచించారు. సోమవారం ఆమె బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. తొలుత స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం బెజ్జంకి ఎస్ఐ తిరుపతి, సీఐ విద్యాసాగర్‌తో సమీక్ష నిర్వహించి, స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతలు, నమోదైన కేసుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని కేసులకు సంబంధించిన ఆస్తులను పరిశీలించి, వాటి భద్రత, నిర్వహణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలి

ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ సూచించారు. ప్రతి గ్రామంలో 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం సీసీటీవీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని తెలిపారు.యువతకు పోలీస్ ఉద్యోగాలపై అవగాహన కల్పించి, వారి భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచే 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర' కార్యక్రమం గురించి వివరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 'డయల్ 112' కు సమాచారం అందిన వెంటనే స్పందించి, ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు.




# శాతవాహన నగర్ అభివృద్ధికి మరో ముందడుగు

- **ప్రజలకు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం**
- **పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 12, :**
శంషిగూడ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడిగాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్నిప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని, నూతన వసతి గృహం నేటి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈసదుపాయాలు స్థానికులకు, సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి రత్న ప్రసాద్,ఉపాధ్యక్షుడు ఎం బాబు రావు, ప్రధాన కార్యదర్శి ఎం యాది రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి వెంకట రావు, ఎస్ రామనాధంతో పాటు హెచ్ఎంటీ శాతవాహన నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, శ్రీ ఉమా మహేశ్వర ఆలయ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# హిందూ మతాన్ని స్వీకరించిన తొలి విదేశీ మహిళ సిస్టర్ నివేదిత

## నేడు సిస్టర్ నివేదిత వర్ధంతి

వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా సిస్టర్ నివేదిత చరిత్రను సృష్టించింది. మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యా వంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది. ఐర్లాండ్‌లోని కౌంటీ టైరాన్‌లో 1867 అక్టోబర్ 28న ఆమె జన్మించింది. తండ్రి శామ్యూల్ రిచ్‌మండ్ నోబుల్, తల్లి ఇసాబెల్. స్కాట్లాండ్‌కు చెందిన వాళ్లు ఐర్లాండ్‌లో స్థిరపడ్డారు. మత బోధకుడైన శామ్యూల్ కూతురికి తరచు మానవసేవ గురించి చెప్పేవారు. అయితే, ఆమెకు పదేళ్ల వయసులోనే శామ్యూల్ మరణించాడు. తల్లి ఇసాబెల్ పుట్టింటికి చేరడంతో, మార్గరెట్ అక్కడే పెరిగింది. లండన్‌లోని చర్చి బోర్డింగ్ స్కూల్‌లో, హాలిఫాక్స్ కాలేజీలో ఆమె చదువు సాగింది. ఒకవైపు చదువు కొనసాగిస్తుండ గానే, పదిహేడేళ్ల వయసులోనే చిన్నపిల్లలకు టీచర్‌గా పాఠాలు బోధించేది. తర్వాతి కాలంలో వింబుల్డన్‌లో స్వయంగా ఒక పాఠశాలను నెలకొల్పింది. కాలేజీ చదువు పూర్తయ్యాక వేల్స్‌కు చెందిన ఒక యువకుడితో నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన కొద్ది రోజులకే ఆయన ఆకస్మికంగా మరణించాడు. మార్గరెట్‌కు ఆ షాక్ నుండి త్వరగా తేరుకో లేకపోయింది. మనశ్శాంతి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేది. ఆమె అలాంటి పరిస్థితుల్లో ఉన్న కాలంలోనే స్వామీ వివేకానంద అమెరికా నుంచి 1895లో లండన్ చేరుకున్నది. లండన్‌లోని ఒక సంపన్నుని ఇంట ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద వేదాంత ప్రసంగం కార్యక్రమానికి ఒక స్నేహితురాలి ద్వారా మార్గరెట్‌కు ఆహ్వానం అందింది. మార్గరెట్ ఆ కార్యక్రమానికి హాజరైంది. అక్కడక్కడ సంస్కృత శ్లోకాలను ఉటంకిస్తూ సాగిన వివేకానందుని వాక్ప్రవాహానికి ఆమె మంత్ర ముగ్ధురాలైంది. ఇక అప్పటి నుంచి లండన్‌లో వివేకానందుని కార్యక్రమాలన్నింటికీ క్రమం తప్పకుండా హాజరయ్యేది. సేవా దృక్పథమే ఆమెను లండన్ నుంచి కలకత్తాకు రప్పించింది. జీవితం అగమ్యంగా మారిన స్థితిలో తారసపడ్డ గురువు స్వామి వివేకా నంద బోధలకు బోధలే శాంతి మార్గమని నమ్మింది. అన్నీ వదులుకుని ఆయనతో కలసి భారత్‌కు వచ్చేసిందామె. అచిర కాలంలోనే సోదరి నివేదితగా భారతీ యులకు చిరపరిచితు రాలైంది. వివేకానందుడి పిలుపుతో ఆమె సముద్రమార్గంలో 1898 జనవరి 28న కలకత్తా చేరుకుంది. వివేకా నందుడి గురువైన రామకృష్ణ పరమహంస సాధనలతో గడిపిన దక్షిణేశ్వర ఆలయాన్ని సందర్శించు కుంది. కలకత్తాలో 1898 మార్చి 11న ఏర్పాటైన బహిరంగ కార్యక్రమంలో స్వామి వివేకానంద తొలిసారిగా మార్గరెట్‌ను ప్రజా నీకానికి పరిచయం చేశారు. కొద్ది రోజులకే ఆమె రామకృష్ణ పరమహంస సతీమణి శారదా దేవిని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. జీవితాంతం బ్రహ్మచర్య దీక్షను అవలంబిస్తానని ప్రతిన బూనడంతో స్వామి వివేకానంద ఆమె పేరును 'సోదరి నివేదిత'గా మార్చారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. నివేదితగా మారిన తర్వాత వివేకానందునితో కలసి ఆమె విస్తృతంగా భారత దేశమంతటా పర్యటించింది. నిధుల సేకరణ కోసం, ఆధ్యాత్మిక ప్రచారం కోసం అమెరికా కూడా వెళ్లింది. అల్మోరాలో ఉన్న సమయంలో ధ్యానం చేయడంలో శిక్షణ పొందింది. మనసు తన గరిమనాభిని మార్చుకునే ప్రక్రియగా ధ్యాన ప్రక్రియను ఆమె అభివర్ణించింది. భారతదేశం గొప్ప మహిమాన్విత దేశమని పొగుడుతూ పాశ్చాత్య దేశాల్లోని తన మిత్రులకు ఉత్తరాలు రాసేది. వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ది మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించింది. ఇతరులపై దయా గుణంతో మెలిగే ఆమె, మంచి అభిరుచిగల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. ముఖ్యంగా బాలికల విద్యకోసం ఆమె 1898 నవంబరులో కలకత్తా లోని బాగ్‌బజారులో పాఠశాలను ప్రారంభించింది. కనీస విద్యలేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేసింది. ప్రాథమిక విద్య అందించడానికి విశేష కృషి చేసింది. అన్నికులాల మహిళలకు చదువు తప్పనిసరిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. బెంగాల్ మహిళలతో, మేధావులతో పరిచయాలను ఏర్పాటు చేసుకుని బాలికల విద్యకోసం ఎంతో శ్రమించింది. విశ్వకవి రవీంద్రనాథ టాగూరు, జగదీశ్ చంద్ర బోస్ తదితర ప్రముఖులతో స్నేహసంబంధాలను కొనసాగించింది. 1899 సంవత్సరం మార్చిలో కలకత్తావాసులకు ప్లేగ్ వ్యాధి సోకినప్పుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించింది. భారత మహిళల ఔన్నత్యం గురించి, ఆచార వ్యవహారాల గురించి న్యూయార్క్ , షికాగో మొదలైన నగరాల్లో ఆమె ప్రసంగించింది. వివేకానందుని బోధలను యువతరానికి చేరవేసేందుకు అహరహం కృషి చేసింది. కలకత్తాలో ప్లేగు మహమ్మారి వ్యాపించినప్పుడు రోగుల దగ్గరే ఉండి, వారికి సేవలందించింది. భారత జాతీయ, స్వాతంత్ర్యో ద్యమాలకు ఇతోధికంగా తోడ్పాటు నందించింది. విద్యా వ్యాప్తికి, సేవా కార్యక్రమాల అమలుకు విశేషంగా కృషి చేసింది. స్వాతంత్ర్య సమర యోధుడు, ఆధ్యాత్మికవేత్త అరబిందొ ఆధ్వర్యంలో వెలువడే 'కర్మయోగి' పత్రికకు సంపాదకు రాలిగా సేవలందించింది. మేధా సంపత్తిలో భారతదేశం అద్వితీయమైనదని ప్రపంచానికి చాటింది. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషించింది. భారతీయతను పూర్తిగా ఆకళింపు చేసుకున్న ఆమె మహిళావిద్య కోసం ఎంతగానో పాటు పడింది. 1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. విదేశీయురాలు అయినప్పటికీ భారతీ యతను పుణికిపుచ్చుకుని స్వామి వివేకానందతో అనేక దేశాలు పర్యటించి ప్రసంగించిన ఆమె డార్జిలింగ్‌లో ఉండగా, అనారోగ్యానికి గురైన నివేదిత 1911 అక్టోబర్ 13న తన 43వ ఏట తుదిశ్వాస విడిచింది. భారత దేశంతో, భారత ప్రజలతో మమేకమై జీవించిన ఆమె స్ఫూర్తి నేటికీ కొనసాగుతూనే ఉంది. పలు చోట్ల ఆమె స్మారకచిహ్నాలు, ఆమె పేరిట ఏర్పాటైన పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు నేటికీ ఆమె సేవానిరతికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం

## నేడు అంతర్జాతీయ విపత్తు నివారణ దినం






ప్రపంచ వ్యాప్తంగా అనేకానేక దేశాల్లో ప్రకృతి విపత్తులు విరుచుకు పడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతు న్నాయి. మూడు దశాబ్దాలుగా ఐక్యరాజ్య సమితి అక్టోబర్ 13 నాడు ప్రకృతి విపత్తుల నివారణ దినోత్సవాల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విపత్తుల ద్వారా కలిగే ఆర్థిక నష్టాలను తగ్గించుకునే అంశాన్ని నినాదంగా ఐరాస స్వీకరించింది. ఈ సందర్భంగా ప్రకృతి వైపరీత్యాల గురించి అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరం. సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలే విపత్తులు. విపత్తు అనే పదాన్ని ఇంగ్లీష్‌లో "డిజాస్టర్" అంటారు. ఇది మధ్యయుగం నాటి ఫ్రెంచి పదం. దీన్ని మూడు భాషా పదజాలల నుంచి గ్రహించారు. అవి..1) డస్ (ఙబం), ఆస్టర్ (ఞూర్వతీ) అనే గ్రీకు పదాలు. 2) డెస్ (ఙవం), ఆస్ట్రే (ఞూర్తీవ) అనే ఫ్రెంచ్ పదాలు. 3) డిస్ (ఙఱం), ఆస్ట్రో (ఞూర్తీశీ) అనే లాటిన్ పదాలు గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే 'దుష్టనక్షత్రం' అని అర్థం. అలానే విపత్తు అనే పదాన్ని ఇంగ్లీషులో డిసాస్టర్ అంటారు. విపత్తు ఒక భయంకర పరిస్థితి. దీంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. పర్యావరణ స్థితి విచ్ఛిన్నం అవుతుంది. ప్రాణాలను రక్షించడానికి, పర్యావరణాన్ని కాపాడటానికి అవసరమయ్యే అత్యవసర పరిణామమే విపత్తు". భూమి కంపించడం వలన జరిగే వైపరీత్యాలు, జల వైపరీత్యాలు, వడగాలి, అగ్ని, మహమ్మారులు, అంతరిక్షం, ప్రభావాల సంఘటనలు, సౌర జ్వాలలు తదితరాల ప్రభావం మానవ జీవితంపై అధికంగా ఉంది. అలాగే ప్రపంచ యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం, అణు బాంబులు లాంటివి మానవ కారక విపత్తులు విపత్తుల కిందకి వస్తాయి. విపత్తుల వల్ల 1) వరదలు - 30 శాతం; 2) తుపానులు - 21 శాతం; 3) కరవు- 19 శాతం; 4) మహమ్మారి వ్యాధులు - 15 శాతం; 5) భూకంపాలు, సునామీలు - 8 శాతం; 6) భూతాపాలు - 4 శాతం 7) హిమపాతాలు - 11 శాతం; 8) అగ్ని పర్వతాలు - 1 శాతం; 9) కీటక దాడులు - 1 శాతం; నష్టాలు సంభవిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం.. భారత దేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. 'ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్' రిపోర్ట్ ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి ద్వారా సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీటి ప్రభావానికి గురయ్యారు. సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ఇవి ఇప్పటి వరకు భారత దేశంలో, ప్రపంచంలోనూ ఎక్కువసార్లు సంభవించిన విపత్తు 'వరదలు'గా ఆ నివేదిక పేర్కొంది. ప్రకృతి విపత్తులకు భారత్ అంతులేని మూల్యాన్ని చెల్లిస్తోందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక కుండ బద్దలు కొట్టింది. 20 ఏళ్లలో విపత్తుల కారణంగా దేశం 7,950 కోట్ల డాలర్లు (సుమారు రూ.5.91 లక్షల కోట్లు) నష్టపోయింది. ఆర్థిక నష్టాలు, పేదరికం, విపత్తులు- పేరిట 2017 ఆగస్టులో విడుదలైన నివేదికలో వివిధ, దేశాలు నష్ట పోయిన మొత్తం విలువ 2.9 లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. అంతకు ముందు 20 ఏళ్ల వ్యవధి నష్టాల కంటే ఇది రెట్టింపు. ప్రపంచంలో విపత్తుల వల్ల నష్టపోతున్న వారి సంఖ్య 211 మిలియన్లు. విపత్తుల వల్ల భారత్ లో ఏటా 10 బిలియన్ల డాలర్ల నష్టం నష్టం జరుగుతోంది. మన దేశంలో భూమి వరదలకు 12శాతం ( 8శాతం) గురవుతోంది. డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్టుల ప్రకారం దేశంలోని 29 రాష్ట్రాలు ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏదో ఒక విపత్తుకు తరచు గురవు తున్నాయి. దేశంలోని తీరప్రాంతం విశిష్టమైన ప్రకృతి వనరులు, జీవ వైవిధ్యానికి ప్రతీకలు. దేశ ఆర్థిక పరిపుష్టిలో విశేషమైన పాత్ర ఇవి పోషిస్తున్నాయి. 13 రాష్ట్రాల్లోని 84 జిల్లాలు, అండమాన్, లక్షద్వీప్ కేంద్రపాలిత రాష్ట్రాల్లో 7,500 కిలోమీటర్లలో సముద్రతీర ప్రాంతం విస్తరించి ఉంది. వీటిల్లో గుజరాత్ (1,214 కి.మీ.) ఆంధ్రప్రదేశ్ (7 కి.మీ.) రాష్ట్రాల్లో అధికంగా తీరప్రాంతం ఉంది. అడవులు, చిత్తడి నేలలు, పగడపు దిబ్బలు, ఉప్పునీటి కయ్యలు, ఇసుక నేలలు వంటి జీవవైవిధ్యం తీరప్రాంతాల్లో ఉంటాయి. తీరంలోని యాభై కిలోమీటర్ల లోపు రమారమి ముప్పై కోట్ల మేర జనాభా నివసిస్తుంది. పర్యావరణ సమ తుల్యత లోపించడం వాతా వరణంలో పెనుమార్పులు విపత్తులకు మూలకారణం పెరుగుతున్న జనాభా, నగరీకరణ, తీర నియంత్రణ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలు, పరిశ్రమలు, ఓడరేవుల విస్తరణ తీరంలోని జీవ వైవిధ్యానికి చేటు తెస్తూ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలైన తుపానులు, వరదల్లో మృతి చెందేవారికి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ఇస్తోంది. ప్రకృతి విపత్తులు, బీమా రంగం తన పాత్రను ఎక్కువగా నిర్వర్తిస్తూ వస్తూంది. ఈ రంగం, కొన్ని నష్టాలను పూడ్చుటకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తుంది. హరికేన్లు, దావాలనాలు, ఇతర విపత్తులు సంభవించినపుడు ఈ బీమా రంగం సాయం అందిస్తున్నది.6.10.2009 నాటి రెవిన్యూ డిపార్ట్ మెంట్ జి.వో.23 ప్రకారం పూర్తిగా దెబ్బతిన్న ఇంటికి 5000, పాక్షికంగా దెబ్బతిన్న ఇంటికి 4000, బట్టల కోసం1500 పాత్రల కోసం1500, బియ్యం 20 కిలోలు, కిరోసిన్ 5 లీటర్లు ఇస్తారు. పర్యావరణ పరిరక్షణ చట్టం(1986)కు అనుబంధంగా తీరప్రాంత నియంత్రణ నిబంధనల పేరిట కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్ జెడ్) నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 1991లో అమలులోకి తీసుకొచ్చింది కొన్ని వర్గాల కార్య కలాపాలకు అడ్డుగా ఉన్న ఈ నిబంధనలను అమలు చేయడంలో ప్రభుత్వ వ్యవస్థ విఫల మయింది. విదేశీ నౌకా నియంత్రణ, పర్యా వరణ పరిరక్షణ, ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ అటవీ, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక చట్టాలు తీరప్రాంత పరిరక్షణతో ముడివడి ఉన్నాయి. 1991 నాటి నిబంధనల్లో తీరాన్ని మూడు విభాగాలు (సీఆర్ జెడ్-1,2,3)గా విభజించారు. ఆయా ప్రాంతాల్లో వివిధ నిర్మాణం చేపట్టడానికి నియంత్రణలు విధించాలి. అయితే పలు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ఇవి అడ్డుగా ఉన్నాయన్న ఉద్దేశంతో నిబంధనల్లో సవరణలు తీసు కొచ్చారు తప్పితే, నోటిఫికేషన్ లక్ష్యాలకు అనుగుణంగా నియమాలు అమలుచేసిన దాఖలాలు తక్కువ. సీఆర్జెడ్ నిబంధనలను 1991 మధ్య కాలంలో 12సార్లు సవరించి వివిధ అభివృద్ధి కార్యక్రమాల విస్తరణకు అనుమతించారు. ఈ నోటిఫికేషన్ అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదే. అయితే నిబంధనల అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నియంత్రించి ప్రకృతి వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అభివృద్ధి పనుల పేరిట మడ అడవులు, హరితవనాలను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విపత్తుల యాజమాన్య ప్రణాళికల అమలు మొక్కుబడిగా మారాయి. 2011 నుంచి కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మించ తలపెట్టిన బహుళ ప్రయోజక షెల్టర్ల దశాబ్దాల క్రితంనాటి తుపాను షెల్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రకృతి వైపరీత్యాల నివారణకై, ప్రణాళికలను బడ్జెట్లో ప్రత్యేకంగా పొందుపరచాల్సిన అవసరం ఉంది. నష్టం అంచనాలో పౌరసమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగ స్వాములను చేయాలి. ప్రకృతి వ్యవస్థలకు హాని కలగకుండా, గొలుసుకట్టు హరిత వనాల పెంపకానికి, మడ అడవుల పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ వనీకరణ నిధులను సమకూర్చాలి. వైపరీత్యాలకు దారి తీయకుండా తీరప్రాంత వనరుల వినియోగం జరిగేలా చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేయాలి. క్షేత్రస్థాయి నుంచి పైదాకా ప్రభుత్వ వ్యవస్థల స్పందన బట్టి బాధిత ప్రజలకు భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కోగలమనే ధైర్యం కలిగించాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బహుముఖ ప్రజ్ఞాశాలి నంజుండయ్య

## నేడు హెచ్‌వీ నంజుండయ్య జయంతి



ఆయన మైసూర్ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు, తొట్టతొలి ఉపకులపతి కూడా. దేశ విదేశాల్లో కీర్తి గడించిన ప్రముఖ విద్యావేత్త దివంగత దేశ మలి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుండి మైసూరు విశ్వ విద్యాలయానికి పిలిపించి, ఆయనతో కలసి పని చేసి అత్యంత సన్నిహితంగా మెదిలిన వ్యక్తి. మైసూర్ దీవాన్ గా, మైసూరు రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయాధిపతిగా విధులు నిర్వర్తించి, న్యాయ సంబంధ బహు గ్రంథ కర్తగా గుర్తింపు పొందిన మేధావి. ప్రపంచం లోని మానవజాతి శాస్త్రవేత్తలలో మొదటి తరానికి చెందిన ప్రముఖునిగా పేరొంది, మైసూరు జాతులు, కులాలపై 1906లో ప్రభావ శీలమైన గ్రంథాన్ని రచించాడు. కన్నడ సాహిత్య సమ్మేళనం వ్యవస్థాపక అధ్యక్షుడై, బెంగళూరు, మైసూరులలో జరిగిన కన్నడ సాహిత్య సమ్మేళనాలకు కొంత కాలం పాటు అధ్యక్షత వహించాడు. మాతృభాష తెలుగు అయినా కన్నడ భాష పట్ల మక్కువతో ఆ భాషకు ఎనలేని సేవలు అందించాడు. ఆయనే హెచ్ వి నంజుండయ్యగా పిలువ బడే హెబ్బళలు వేల్పనూర్ నంజుండయ్య. 1860 అక్టోబర్13వ తేదీన మైసూరులో సుబ్బయ్య, అన్న పూర్ణమ్మ దంపతులకు ఒక బీద కుటుంబంలో నంజుండయ్య జన్మించాడు. మైసూరు మహా రాజు ద్వారా విద్యార్థి ఉపకార వేతనం పొంది మైసూరులోని వెస్లియన్ హైస్కూలు, మద్రాసు లోని మద్రాసు క్రిస్టియన్ కళాశాలలలో చదివి 1880లో బి.ఎ., తరువాత బి.ఎల్. 1893లో ఎం.ఎల్.పట్టాలు పుచ్చు కున్నాడు. 1885లో నంజనగూడులో మున్సిఫ్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ఆరంభించాడు. తర్వాత హసన్‌లో అసిస్టెంట్ కమీషనర్, బెంగుళూరులో సబ్ జడ్జి, శివ మొగ్గ జిల్లా కలెక్టర్, మైసూరు రాజ్య ముఖ్య కార్యదర్శి, ఛీఫ్ జస్టీస్ వంటి వివిధ పదవులను చేపట్టాడు. 1916లో మైసూరు విశ్వ విద్యాలయం ప్రారంభ మైనప్పుడు దానికి మొదటి ఉపకులపతిగా నియమించ బడి 1920లో మరణించేవరకు ఆ పదవిలో కొనసాగాడు. మృతి చెందిన తన కుమారుని స్మృత్యర్థం విక్టర్ హ్యూగో వ్రాసిన ఫ్రెంచి కవితలను "టియర్స్ ఇన్ ద డార్క్" అనే పేరుతో ఆంగ్లం లోనికి అనువదించాడు. ఆయన అనేక సామాజిక కార్యక్రమాలలో పాల్గొన్నాడు. వితంతువుల కోసం "విడోస్ హోమ్" ను స్థాపించాడు. హరిజనోద్ధరణ కొరకు సెంట్రల్ బోర్డింగ్ స్కూలు, హాస్టలు, కుటీర పరిశ్రమ స్థాపించాడు. స్త్రీ విద్య గురించి ప్రచారం చేశాడు. పల్లెపల్లెలో తిరిగి విద్యా వసతులలోని కొఱతను గుర్తించి జాతీయ విద్యా విధానానికి పిలుపు నిచ్చాడు. నంజుండయ్య మాతృభాష తెలుగు అయినా కన్నడ భాష పట్ల ఎక్కువ మక్కువ కలిగి, కన్నడ సాహిత్య పరిషత్తును స్థాపించి దాని ద్వారా కన్నడ పుస్తకాల ప్రచురణ, సాహిత్య సదస్సుల నిర్వహణ, పరిశోధ నలకు ప్రోత్సాహము, కన్నడ సాహిత్య సమ్మేళనాల నిర్వహణ తదితర కార్యక్రమా లు చేపట్టాడు. ఆయన్ను కన్నడ సాహిత్య సమ్మేళనాలకు మొదటి మూడు సంవత్సరాలకు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు బహుభాషావేత్తగా అనేక గ్రంథాలను రచించాడు. కన్నడ భాషలో వ్యవహార దీపికె, వ్యవహార ధర్మశాస్త్ర, అర్థశాస్త్ర, లేఖ్యబోధిని, రాత్రియల్లి కంబని, ఆంగ్లభాషలో మైసూర్ ట్రైబ్స్ అండ్ కాస్ట్స్, టియర్స్ ఇన్ ద నైట్ (విక్టర్ హ్యూగో ఫ్రెంచి రచనకు ఆంగ్లానువాదం) మొదలైనవి ఆయన ముఖ్య రచనలు. మైసూరు మహారాజుకు రాజకీయ, పరిపాలనా సలహా దారుగా ఉండి, క్లిష్ట సమయం లో మైసూరు దివాన్‌గా కూడా పనిచేశాడు. అలా మైసూరు మహారాజు నంజుండయ్యకు "రాజమంత్ర ప్రవీణ" అనే బిరుదును ప్రదానం చేశారు. 1911లో ఢిల్లీలో చక్రవర్తి పట్టాభిషేక మహోత్సవానికి అతిథిగా ఆహ్వానించ బడ్డాడు. 1915లో బ్రిటిష్ ప్రభువు 5వ కింగ్ జార్జ్ ఆయనను "కంపాని యన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్" బిరుదుతో సత్కరించాడు. బెంగళూరులోని మల్లేశ్వరం ప్రాంతంలో తన తొలి నివాస మైన తన భవనాన్ని బాలికల ఉన్నత పాఠశాల కోసం ప్రభుత్వానికి దానం చేశాడు. నేటికీ మల్లేశ్వరం 4వ మెయిన్, 13వ క్రాస్‌లోని ఆ భవనంలో బాలికల హైస్కూలు నడుప బడుతూ ఉంది. ఆయన కుటుంబీకులు ప్రస్తుతం సదరు భవనం సమీపంలోనే నివసిస్తు న్నారు. ఆయన1920, మే 7వ తేదీన మరణించాడు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# లేడీ ఫ్యాన్‌కు శ్రేయస్ అయ్యర్ క్షమాపణలు..

## 'తర్వాతి మ్యాచ్‌లో బెస్ట్ ఇన్నింగ్స్ గిఫ్ట్‌గా ఇస్తా'!

**ఇండోర్, అక్టోబర్ 12 :** వెస్టిండీస్‌తో ఇండోర్ వేదికగా జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్ అనంతరం టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ మైదానంలో తన పట్ల అపరిమితమైన ప్రేమను ప్రద ర్శించిన ఒక లేడీ ఫ్యాన్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం విశేషంగా నిలిచిం ది. ఈ సిరీస్‌లోని తొలి టీ20లో సెంచరీ సాధించి, రెండో మ్యాచ్‌లో 40 పరుగుల తో అలరించిన శ్రేయస్ అయ్యర్‌పై ఈ మ్యాచ్‌లోనూ అభిమానులు భారీ ఆశలు పె ట్టుకున్నారు. అయితే రొస్టన్ చేజ్ బౌలింగ్‌లో అయ్యర్ కేవలం 1 పరుగు మాత్రమే చేసి ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ప్రియతమ నటుడు/క్రికెటర్ త్వరగా ఔట్ కావడం తో స్టాండ్స్‌లో ఉన్న ఒక లేడీ ఫ్యాన్ తట్టుకోలేక బోరున ఏడ్చేసింది. ఈ భావోద్వేగ దృశ్యాలు కెమెరాలో రికార్డై సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సైతం ఆ అభిమాని ప్రేమాభిమానాలను కొనియాడారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రెజెంటర్ ఇయాన్ బిషప్ ఈ విషయాన్ని శ్రేయస్ అయ్యర్ దృష్టికి తీసుకెళ్లగా, అయ్యర్ ఎంతో నమ్రతతో స్పందించారు. "నేను ఎప్పుడూ జట్టు ను గెలిపించేందుకు బెస్ట్ ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నిస్తాను. కానీ ఈ రోజు దురదృష్టవశాత్తూ త్వరగా ఔటయ్యాను. నా ఆట చూడటానికి వచ్చి నిరాశచెందిన ఆ వీరాభిమానికి క్షమాపణలు చెబుతున్నాను. కచ్చితంగా తర్వాతి మ్యాచ్‌లో అద్భు తమైన ఇన్నింగ్స్ ఆడి, ఆమె ముఖంలో చిరునవ్వు నింపుతాను" అని మాటిచ్చారు. అయ్యర్ మాటలకు ఆనందంతో ఆ అభిమాని స్టాండ్స్‌లోనే కేరింతలు కొట్టింది. ఫ్యాన్స్ పట్ల శ్రేయస్ అయ్యర్ చూపిన ఈ గౌరవానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.




# స్మృతి మంధానకు అరుదైన గౌరవం..

## భారత్‌లో 'యూనిసెఫ్' సెలబ్రిటీ సలహాదారుగా నియామకం!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (ఉద్యమ కెరటం):** భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. భారత్‌లో 'యూనిసెఫ్' సెలబ్రిటీ సలహాదారుగా ఆమెను నియమిస్తున్నట్లు ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని (అక్టోబర్ 11) పురస్కరించుకుని యూనిసెఫ్ ఈ ప్రత్యేక ప్రకటనను విడుదల చేసింది. ఈ నూతన బాధ్యతల ద్వారా స్మృతి మంధాన బాలికలకు సమాన అవకాశాల కల్పన, ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణ మరియు భద్రతకు సంబంధించిన వివిధ అంశాలపై యూనిసెఫ్‌తో కలిసి చురుగ్గా పనిచేయనున్నారు. ముఖ్యంగా క్రీడల ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం, లింగ వివక్షను రూపుమాపడం వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆమె తన వంతు పాత్ర పోషించనున్నారు. ఈ సందర్భంగా యూనిసెఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. క్రీడారంగంలో స్మృతి మంధాన సాధించిన విజయాలు, కోట్లాది మంది యువతులకు మరియు బాలికలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని కొనియాడారు. ఆమె చేరికతో బాలికల హక్కులపై సమాజంలో మరింత అవగాహన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, క్రీడల్లోనే కాకుండా సామాజిక బాధ్యతలోనూ ముందంజలో నిలిచిన స్మృతి మంధానను అభిమానులు, క్రీడా ప్రముఖులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

# వేలానికి ముందే ముంబై మాస్టర్‌స్ట్రోక్!

## రూ.10 లక్షలకు మహిళా పేసర్ తారా నోరిస్ సొంతం

- యూపీ వారియర్స్ నుంచి ట్రేడింగ్ ద్వారా దక్కించుకున్న ముంబై ఇండియన్స్
- అక్టోబర్ 28న కొచ్చిలో మహిళల ప్రీమియర్ లీగ్ వేలం
- ఎడమచేతి పేసర్‌తో బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకున్న మాజీ ఛాంపియన్
- ముంబై విదేశీ క్రీడాకారిణుల కోటా పూర్తి.. ఖాతాలో రూ.90 లక్షలు




**ముంబై, అక్టోబర్ 12 :** మహిళల ప్రీమియర్ లీగ్ ఐదో సీజన్ వేలానికి ముందే ముంబై ఇండియన్స్ కీలక అడుగు వేసింది. ట్రేడింగ్ ద్వారా అనుభవజ్ఞురాలైన ఎడమచేతి పేసర్ తారా నోరిస్‌ను జట్టులోకి తీసుకుంది. యూపీ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ మహిళా క్రికెటర్‌ను రూ.10 లక్షలకు ముంబై సొంతం చేసుకున్నట్లు సమాచారం. అక్టోబర్ 28న కొచ్చిలో జరగనున్న వేలానికి ముందే బౌ లింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకునేందుకు ముంబై యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో అనుభవం ఉన్న నోరిస్ చేరికతో జట్టుకు అదనపు బలం చేకూరుతుందని భావిస్తోంది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ముంబై ఇండియన్స్ రాబోయే సీజన్‌కు పటిష్ఠమైన జట్టును సిద్ధం చేసుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా యూపీ వారియర్స్‌తో ట్రేడింగ్ ఒప్పందం కుదుర్చుకుని తారా నోరిస్‌ను తీసుకున్నట్లు వెల్లడైంది. గత వేలంలో యూపీ వారియర్స్ ఆమెను రూ.10 లక్షలకు కొనుగోలు చేయగా, ఇప్పుడు అదే మొత్తానికి ముంబైకి బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. దీంతో వేలానికి ముందే ముంబై జట్టులో మరో అనుభవజ్ఞురాలైన విదేశీ క్రీడాకారిణి చేరినట్లయింది. తారా నోరిస్‌కు మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఆడిన అనుభవం ఉంది. 2023 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగిన ఆమె తన ఎడమచేతి పేస్ బౌలింగ్‌తో ఆకట్టుకుంది. ఆ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి ఏడు వికెట్లు పడగొట్టింది. ముఖ్యంగా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టే బౌలింగ్‌తో గుర్తింపు పొందింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ ఆమెను విడుదల చేయడంతో మరో ఫ్రాంచైజీ తరఫున ఆడే అవకాశం లభించింది. తర్వాతి దశలో యూపీ వారియర్స్ ఆమెను జట్టులోకి తీసుకుంది. అయితే మహిళల టీ20 ప్రపంచకప్ అర్హత పోటీల కోసం అమెరికా జట్టుకు ఎంపిక కావడంతో ఒక సీజన్‌లో ఆమె ఆడలేకపోయింది. అనంతరం 2026 సీజన్ వేలంలో యూపీ వారియర్స్ రూ.10 లక్షలకు నోరిస్‌ను కొనుగోలు చేసింది. సెప్టెంబర్ 28న క్రీడాకారిణులను అట్టిపెట్టుకునే గడువు ముగిసే సమయానికి ఆమెను తమ జాబితాలో కొనసాగించిన యూపీ, ఆ తర్వాత ముంబై నుంచి వచ్చిన ట్రేడింగ్ ప్రతిపాదనకు అంగీకరించినట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ కుటుంబంతో తారా నోరిస్‌కు ఇప్పటికే అనుబంధం ఉ ండటం విశేషం. గతంలో ది హండ్రెడ్ లీగ్‌లో ఎంఐ లండన్ జట్టు తరఫున ఆమె బరిలోకి దిగింది. దీంతో ముంబై ఫ్రాంచైజీ వ్యవస్థలో ఆడటం ఆమెకు కొత్తేమీ కాదు. ఇప్పుడు మహిళల ప్రీమియర్ లీగ్‌లోనూ ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. నోరిస్ చేరికతో ముంబై ఇండియన్స్ విదేశీ క్రీడాకారిణుల కోటా పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం జట్టు వద్ద వేలం కోసం రూ.90 లక్షల నిధులు అందుబాటులో ఉ న్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తంతో స్వదేశీ క్రీడాకారిణుల ఎంపికపై యాజమాన్యం దృష్టి సారించే అవకాశముంది. రాబోయే సీజన్‌లో మరోసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ముంబై ఇండియన్స్ జట్టు కూర్పుపై కసరత్తు చేస్తోంది. అక్టోబర్ 28న కొచ్చిలో జరగనున్న వేలానికి ముందు చోటుచేసుకున్న ఈ ట్రేడింగ్ మహిళల క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అనుభవజ్ఞురాలైన ఎడమచేతి పేసర్‌ను తక్కువ మొత్తానికే దక్కించుకోవడం ముంబైకి ఉపయోగపడే నిర్ణయంగా భావిస్తున్నారు. రాబోయే సీజన్‌లో తారా నోరిస్ ముంబై ఇండియన్స్ తరఫున ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఆరు బంతుల్లోనే అదరగొట్టాడు..

- అరుదైన రికార్డు కొట్టేశాడు!
- మూడు ఫోర్లతో 13 పరుగులు చేసిన ప్రిన్స్ యాదవ్
- పదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కీలక ఇన్నింగ్స్
- శ్రీశాంత్, అశ్విన్ సరసన అరుదైన ఘనత
- దాదాపు 15 ఏళ్ల తర్వాత ఈ ఘనత సాధించిన భారత బ్యాటర్
- వెస్టిండీస్‌పై 14 పరుగుల తేడాతో భారత్ విజయం
- ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-1తో టీమిండియా ఆధిక్యం

**ఇండోర్, అక్టోబర్ 12 :** వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత యువ క్రికెటర్ ప్రిన్స్ యాదవ్ అరుదైన ఘనత సాధించినట్లు వార్తలు వెలువడ్డాయి. పదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు కేవలం ఆరు బంతుల్లో మూడు ఫోర్ల సహాయంతో 13 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు భారీ స్కోరు సాధించడంలో చివరి వరుస బ్యాటర్‌గా కీలక పరుగులు జోడించాడు. భారత్ ఈ మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో విజయం సాధించిన నేపథ్యంలో ప్రిన్స్ చేసిన 13 పరుగులు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మూడో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 223 పరుగులు సాధించినట్లు అందిన వివరాలు పేర్కొంటున్నాయి. ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు అర్ధశతకంతో ఆకట్టుకోగా, చివరి ఓవర్లలో ప్రిన్స్ యాదవ్ దూకుడుగా ఆడాడు. పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగినప్పటికీ ఏమాత్రం వెనుకాడకుండా బౌండరీలు బాదాడు. ఆరు బంతులు ఎదుర్కొని మూడు ఫోర్లతో 13 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. బౌలింగ్‌లో నాలుగు ఓవర్లు వేసిన ప్రిన్స్ యాదవ్ 37 పరుగులు ఇచ్చి వికెట్ సాధించలేకపోయాడు. అయితే బ్యాటింగ్‌లో తనకు లభించిన కొద్దిపాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. చివరి ఓవర్లలో అతడు జోడించిన పరుగులు జట్టు స్కోరును 223కు చేర్చడంలో ఉపయోగపడ్డాయి. ప్రత్యర్థికి 224 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో పదో లేదా పదకొండో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఒకే ఇన్నింగ్స్‌లో కనీసం మూడు ఫోర్లు బాదిన భారత ఆటగాళ్ల జాబితాలో ప్రిన్స్ యాదవ్ చేరినట్లు పేర్కొంటున్నారు. గతంలో ఎస్. శ్రీశాంత్, రవిచంద్రన్ అశ్విన్ ఈ ఘనత సాధించారు. శ్రీశాంత్ 2007లో న్యూజిలాండ్‌పై, అశ్విన్ 2011లో కోల్‌కతాలో ఇంగ్లాండ్‌పై జరిగిన టీ20లో మూడు బౌండరీలు సాధించినట్లు వివరాలు చెబుతున్నాయి. అశ్విన్ తర్వాత దాదాపు 15 ఏళ్లకు ప్రిన్స్ ఈ జాబితాలో చేరినట్లు సమాచారం. భారత్ నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులకే పరిమితమైనట్లు మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పరుగుల వేటను అడ్డుకున్నారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2--1 ఆధిక్యంలోకి వెళ్లినట్లు సమాచారం. సాధారణంగా భారీ స్కోర్లలో అగ్రశ్రేణి బ్యాటర్ల ప్రదర్శనకే ఎక్కువ గుర్తింపు లభిస్తుంది. అయితే చివరి వరుస బ్యాటర్లు సాధించే కొద్దిపాటి పరుగులు కూడా మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేస్తాయని ప్రిన్స్ యాదవ్ ఇన్నింగ్స్ మరోసారి గుర్తుచేసింది. కేవలం ఆరు బంతుల్లోనే మూడు బౌండరీలు సాధించి జట్టుకు ఉపయోగపడే పరుగులు అందించిన ప్రిన్స్ ప్రదర్శన క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.








# తల్లి బాటలో తనయ..

## టాలీవుడ్‌లోకి మరో అందాల వారసురాలు!

### హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతున్న శ్రీకాంత్-ఊహల కుమార్తె మేధా మేక

తెలుగు చిత్ర పరిశ్రమలోకి మరో సినీ వారసురాలు అడుగుపెడుతోంది. టాలీవుడ్ సీనియర్ కథానాయకుడు శ్రీకాంత్, ఒకప్పటి కథానాయిక ఊహల కుమార్తె మేధా మేక హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం కాబోతోంది. ఇప్పటికే వీరి పెద్ద కుమారుడు రోషన్ మేక కథానాయకుడిగా సినీ రంగంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తుండగా, ఇప్పుడు కుమార్తె మేధా కూడా తల్లిదండ్రుల బాటలో నటిగా అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన రొమాంటిక్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకుంటోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి యువ దర్శకుడు పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు ప్రేక్షకుల్లో విశేష ఆదరణ పొందిన '30 వెడ్స్ 21' వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించిన పృథ్వీ వనం మరోసారి ప్రేమకథా నేపథ్యంలో సినిమా రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో జై జాస్తి కథానాయకుడిగా నటిస్తుండగా, మేధా మేక కథానాయికగా పరిచయమవుతోంది. వీరిద్దరి జంటను పరిచయం చేస్తూ చిత్రబృందం విడుదల చేసిన పోస్టర్ సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొత్త సినిమా పేరును ఇంకా ప్రకటించని నిర్మాతలు ప్రస్తుతం 'మైత్రీ ఇన్ లవ్' అనే ప్రచార నినాదంతో చిత్రాన్ని పరిచయం చేస్తున్నారు. తాజాగా విడుదల చేసిన రొమాంటిక్ పోస్టర్‌లో జై జాస్తి, మేధా మేక జంట ఆకట్టుకునేలా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య ప్రేమకథ ఎలా సాగనుంది, సినిమా కథాంశం ఏమిటి అనే విషయాలపై ఆసక్తి నెలకొంది. త్వరలోనే సినిమా పేరును అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా మేధా మేక కథానాయికగా పరిచయం కావడం విశేషంగా మారింది. సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, విడుదల తేదీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు సమాచారం. శ్రీకాంత్, ఊహల పెద్ద కుమారుడు రోషన్ మేక ఇప్పటికే తెలుగు చిత్ర పరిశ్రమలో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 'పెళ్లి సందడి' చిత్రంతో ప్రేక్షకులకు చేరువైన రోషన్ ప్రస్తుతం తన నాలుగో చిత్రం 'ఏమో ఏమో ఇది' విడుదల కోసం సిద్ధమవుతున్నాడు. ఇప్పుడు అతడి సోదరి మేధా కూడా నటిగా పరిచయం అవుతుండటంతో శ్రీకాంత్ కుటుంబం మరోసారి సినీ వార్తల్లో నిలిచింది. మేధా మేకకు నటనతోపాటు క్రీడలపైనా ఆసక్తి ఉంది. జాతీయ స్థాయిలో బాస్కెట్‌బాల్ క్రీడాకారిణిగా రాణించిన ఆమె ఇప్పుడు సినీ రంగంలో తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమవుతోంది. తల్లి ఊహ నటిగా తెలుగు ప్రేక్షకుల్లో సంపాదించుకున్న గుర్తింపును మేధా కూడా అందుకుంటుందా అనే ఆసక్తి నెలకొంది. ఊహ 'ఆమె' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆమె కుమార్తె కూడా కథానాయికగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనుండటంతో సినీ అభిమానుల దృష్టి ఈ చిత్రంపై పడింది.



# అతడి నిర్ణయమే ఫైనల్..

### పెళ్లి పుకార్లపై మమితా బైజు క్లారిటీ

మలయాళ కల్ట్ హిట్ 'ప్రేమలు' చిత్రంతో తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న యువ నటి మమితా బైజు తనపై వస్తున్న పెళ్లి పుకార్లకు సోషల్ మీడియా వేదికగా చెక్ పెట్టారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ వివాహం గురించి ఇటీవల నెట్టింట రకరకాల వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో స్పందించిన మమితా బైజు, తన జీవితంలో ప్రతీ కీలక నిర్ణయం వెనుక తన సోదరుడే ఉంటాడని స్పష్టం చేశారు. తాను ఎవరిని వివాహం చేసుకుంటాననే విషయంతో సహా కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రతీ అడుగును తన సోదరుడు మిథున్ బైజు నిర్ణయిస్తాడని మమితా బైజు తెలిపారు. "నాకు, నా సోదరుడు మిథున్ బైజుకు మధ్య బంధం కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధం మాత్రమే కాదు.. మేం మంచి స్నేహితుల కంటే ఎక్కువే. నా జీవితానికి సంబంధించి ఏ నిర్ణయమైనా మిథునే తీసుకుంటాడు. నా పెళ్లి విషయంలోనూ నా అన్న తీసుకునే నిర్ణయమే అంతిమం. అంతేకాదు, నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్‌ను కూడా అతడే స్వయంగా హ్యాండిల్ చేస్తాడు" అని ఆమె వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో తన పెళ్లి వార్తలపై స్పందిస్తూ.. 'ఏంటీ..?' అని రాసి ఉన్న డైలామాతో కూడిన ఒక మినియన్ స్టిక్కర్‌ను పోస్ట్ చేశారు. ప్రస్తుతం మమితా బైజు చేసిన ఈ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారడంతో, ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పడినట్లయింది. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే సూర్య సరసన నటించిన సినిమాతో పాటు పలు ప్రాజెక్ట్‌లతో ఆమె వరుస విజయాలను అందుకుంటూ దూసుకెళ్తున్నారు.



# ఒక్క సినిమాతో గుర్తింపు ఆరాధ్య దేవి గ్లామర్ సందడి!

చిత్ర పరిశ్రమలో కొత్త కథానాయికల ప్రవేశం కొనసాగుతూనే ఉంది. ఇతర భాషల నుంచి వచ్చిన నటీమణులతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న అమ్మాయిలు కూడా వెండితెరపై అవకాశాలు అందుకుంటున్నారు. అలా ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన పేరు ఆరాధ్య దేవి. తన అందం, ఛాయాచిత్రాలు, వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ భామ గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఆరాధ్య దేవి అసలు పేరు శ్రీలక్ష్మీ సతీష్. సామాజిక మాధ్యమాల్లో చిన్నచిన్న వీడియోలు చేస్తూ ఆమె గుర్తింపు సంపాదించుకున్నారు. ఆమె వీడియోలను చూసిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన చిత్రంలో కథానాయికగా అవకాశం ఇచ్చినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆమె ప్రధాన పాత్రలో 'శారీ' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాతో ఆరాధ్య దేవి పేరు ప్రేక్షకుల్లోనూ చర్చకు వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో చీరకట్టులో కనిపించిన ఆరాధ్య దేవి, సినిమాల్లో మాత్రం భిన్నమైన రూపంతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆమె పాత వీడియోలు, తాజా ఛాయాచిత్రాలను పోలుస్తూ అభిమానులు చర్చించుకుంటున్నారు. ఒక్క సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఆమె, తనకు వచ్చిన గుర్తింపును మరిన్ని అవకాశాలుగా మార్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు. గ్లామర్ పాత్రల విషయంలో తన ఆలోచనలు మారాయని ఆరాధ్య దేవి గతంలో చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఒకప్పుడు అలాంటి పాత్రలకు దూరంగా ఉండాలని భావించినప్పటికీ, ఇప్పుడు తన అభిప్రాయాన్ని మార్చుకున్నట్లు సమాచారం. గ్లామర్ పాత్రలతో పాటు విభిన్నమైన పాత్రల్లోనూ నటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె వెల్లడించినట్లు ప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన గుర్తింపుతో చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన ఆరాధ్య దేవి, ఇకపై ఎలాంటి కథలను ఎంచుకుంటారు? మరిన్ని అవకాశాలతో ప్రేక్షకుల ముందుకు వస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com